




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 11 సంచిక : 195 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శనివారం 22 మార్చి 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 195 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE SAT 22 MARCH 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelluru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur




# వేంకటేశ్వరుడి ప్రాణభిక్షతోనే బతికున్నా

- నారా దేవాన్ష్ పుట్టినరోజు
- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం
- అన్న ప్రసాద కేంద్రంలో ప్రసాదాల వితరణ
- 24 క్లైమోర్స్ పేలినా బతికున్నానంటే వేంకటేశ్వరస్వామి భిక్షతోనేనన్న ముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:సీఎం చంద్రబాబు నాయుడు తన మనవడు నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం వేంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు వెంగ మాంబ అన్నవితరణ కేంద్రంలో అన్నప్రసాదం స్వయంగా వడ్డించారు. అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు.

"రాష్ట్రంలో ఇప్పటికీ చాలా గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి దేవాలయాలు లేవు. ఆయా గ్రామాల్లో వెంకన్న ఆలయాల నిర్మాణాల కోసం నిధులు సేకరించేందుకు ట్రస్టు ఏర్పాటు చేస్తాం. నాడు ఎన్టీఆర్ అన్నదానం, నేను ప్రాణదానం కార్యక్రమాలు ప్రవేశపెట్టాం. మూడవ కార్యక్రమంగా ఆలయాల నిర్మాణాలను తలపెడుతున్నాం. మాధవ సేవ కోసమే ఆలయాల నిర్మాణానికి ట్రస్ట్ ఏర్పాటు చేస్తాం. ట్రస్ట్‌కు వచ్చే నిధులు పగడ్బందీగా ఖర్చు చేస్తాం.

వేంకటేశ్వరస్వామి ఆస్తులు ఎవరు కబ్జా చేసినా వాటిని తిరిగి దేవుడికే చెందేలా చేస్తాం" అని చంద్రబాబు అన్నారు.

వేంకటేశ్వరుడి ప్రాణభిక్షతోనే బతికున్నా...

దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నామని చంద్రబాబు తెలిపారు. ప్రతి పుట్టిన రోజు నాడు తిరుమలలో అన్నదానం చేయడం ఆనవాయతీగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. తిరుమలలో అన్నదానాన్ని

వివరాలు 2లో..

## మంత్రి ఫరూఖ్ కు భార్యావియోగం...
# దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చంద్రబాబు, పవన్, లోకేశ్

- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మంత్రి ఫరూఖ్ భార్య
- హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స
- ఉదయం కన్నుమూత
- సంతాపం తెలిపిన కూటమి పెద్దలు



పెన్ పవర్ డెస్క్:ఏపీ మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ కు భార్యావియోగం కలిగింది. ఆయన భార్య షహనాజ్ హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ నేపథ్యంలో, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

వివరాలు 11లో..

# నాడు చంద్రబాబు తల్లి ఆశీస్సులు తీసుకుని పాదయాత్ర ప్రారంభించాను

- మంద కృష్ణ మాదిగ ప్రెస్ మీట్
- చంద్రబాబు వల్లే ఎస్సీ వర్గీకరణపై ఏకగ్రీవ తీర్మానం వచ్చిందని వెల్లడి
- వర్గీకరణపై వైసీపీ ఇంకా అభిప్రాయమే చెప్పలేదని ఆరోపణ
- గతంలో జగన్ కలిసేందుకు కూడా తమకు అనుమతి ఇవ్వలేదని వెల్లడి



పెన్ పవర్ డెస్క్: వివిధ రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ముందుకు తీసుకుపోతున్న నేపథ్యంలో, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మీడియా ముందుకు వచ్చారు. ఏపీ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై ఏకగ్రీవ తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. 1997లో తాను చంద్రబాబు తల్లి ఆశీస్సులు తీసుకుని పాదయాత్ర ప్రారంభించానని గుర్తుచేసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం చంద్రబాబు

వివరాలు 11లో..

## తెలంగాణ హైకోర్టులో వైఎస్
# వివేకానంద కూతురు సునీత పిటిషన్

- తన తండ్రి హత్య కేసు సీబీఐ కోర్టులో రోజువారీగా విచారణ జరిగేలా ఆదేశించాలని పిటిషన్
- నాలుగేళ్లుగా కేసు విచారణ కొనసాగుతున్నప్పటికీ పురోగతి ఏమీ లేదని పిటిషన్‌లో పేర్కొన్న సునీత
- విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసిన కోర్టు




పెన్ పవర్ డెస్క్:వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణపై తెలంగాణ హైకోర్టులో ఆయన కూతురు సునీత పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో ఆమె సీబీఐని ప్రతివాదిగా చేర్చారు. సీబీఐ కోర్టులో తన తండ్రి హత్య కేసును రోజువారీగా విచారించేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు.

వివరాలు 2లో..

# పోసానికి ఊరట... సీఐడీ కేసులో బెయిల్ మంజూరు

- పోసానికి బెయిల్ మంజూరు చేసిన గుంటూరు కోర్టు
- ఏపీలో పోసానిపై 19 కేసులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక పోసానికి తిప్పలు!



పెన్ పవర్ డెస్క్:ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళికి ఊరట కలిగింది. గుంటూరు కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. సీఐడీ నమోదు చేసిన కేసులో పోసానికి బెయిల్ లభించింది. పోసాని బెయిల్ పిటిషన్‌పై గుంటూరు కోర్టు బుధవారం విచారణ జరిపి తీర్పును

వివరాలు 2లో..

# చిరంజీవికి ఒక్కసారి చెబితే మానేశాడు... స్పిరిట్ అంటే అదీ!

- బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో సినీ తారల పేర్లు
- ఆసక్తికర విషయం వెల్లడించిన సీపీఐ నారాయణ
- గతంలో తాను చెబితే కోకాకోలా యాడ్ కు చిరు గుడ్ బై చెప్పాడని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో సినీ తారల పేర్లు కూడా తెరపైకి రావడం పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ స్పందించారు. గతంలో మెగాస్టార్ చిరంజీవి ఓసారి కోకాకోలా డ్రింక్ కు ప్రచారం చేశాడని, కానీ తాను ఓసారి లేఖ రాశానని, ఆ డ్రింక్ కు ప్రచారం కల్పించవద్దని చెప్పానని వెల్లడించారు. "బాండీలో కోకాకోలా పోసి వేడి చేస్తే అది రంగు మారింది. ఇదే విషయాన్ని చిరంజీవికి వివరించాను.

వివరాలు 11లో..

## ట్రంప్ మరో సంచలన నిర్ణయం...
# విద్యాశాఖ మూసివేత...
## తనదైన శైలిలో మస్క్ ట్వీట్

- అమెరికా విద్యాశాఖ మూసివేతకు ట్రంప్ ఆమోదం
- విద్యా వ్యవహారాలపై ఇకమీదట రాష్ట్రాలకే అధికారాలు
- ఈ మేరకు ఉత్తర్వులు



పెన్ పవర్ డెస్క్:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఏకంగా విద్యాశాఖనే ఎత్తేశారు. ఈ మేరకు విద్యాశాఖ మూసివేత ఉత్తర్వులపై ట్రంప్ సంతకం

వివరాలు 11లో..

## హరీశ్ రావు 'బుద్ధిమాంద్యం' వ్యాఖ్యలపై
# శాసనసభలో దుమారం

- బుద్ధిమాంద్యం వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్న భట్టి విక్రమార్క
- రేవంత్ రెడ్డి బట్టలూడదీసి కొడతానంటే వారించలేదన్న హరీశ్ రావు
- బుద్ధిమాంద్యం అంటే తప్పెలా అవుతుందన్న హరీశ్ రావు



పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు శాసనసభ లో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. హరీశ్ రావు సభలో మాట్లాడుతూ 'బుద్ధిమాంద్యం' అని వ్యాఖ్యానించడంపై ఉప ముఖ్యమంత్రి

వివరాలు 2లో..

# ఇండియాలో టాప్-10 రిచ్చెస్ట్ ఎమ్మెల్యేలు వీళ్లే..





పెన్ పవర్ డెస్క్: భారతదేశంలోని ప్రజాప్రతినిధుల గురించి అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఆసక్తికర వివరాలను బయటపెట్టింది. ఇండియాలో కోట్లకు పడగలెత్తిన టాప్-10 రిచ్చెస్ట్ ఎమ్మెల్యేల డేటాను %ాణ=% ప్రకటించింది. ఈ జాబితాలో మహారాష్ట్రకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే పరాగ్ షా 3 వేల 383 కోట్ల ఆస్తిపాస్తులతో టాప్ ప్లేస్?లో ఉన్నారు. పరాగ్ షా మహారాష్ట్రలోని ఘట్కోపర్ తూర్పు నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రెండో స్థానంలో కర్ణాటక కాంగ్రెస్ కీలక నేత, ట్రబుల్ షూటర్?గా పేరొందిన కర్ణాటక మంత్రి, కనకపుర ఎమ్మెల్యే డీకే శివకుమార్ నిలిచారు.డీకే శివకుమార్ ఆస్తి 14 వందల 13 కోట్లుగా ఏడీఆర్ వెల్లడించింది. మూడో స్థానంలో కూడా కర్ణాటక ఎమ్మెల్యేనే ఉన్నారు. కర్ణాటకలోని గౌరిబిదనూరు నుంచి స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలిచిన

వివరాలు 2లో..

# హిందీ ఏ భాషకూ పోటీ కాదు..
## రాజకీయంగా లబ్ధి పొందేందుకే భాషా వివాదం: అమిత్ షా

- భాష పేరిట ఇప్పటికే దేశంలో చాలా విభజన వచ్చిందన్న అమిత్ షా
- ఇకపై ఎంత మాత్రం అలా జరగనివ్వబోమన్న అమిత్ షా
- తమిళనాడులో బీజేపీ అధికారంలోకి వస్తే తమిళంలో మెడికల్, ఇంజినీరింగ్ విద్య అందిస్తామని హామీ



పెన్ పవర్ డెస్క్:హిందీ ఏ భాషకూ పోటీ కాదని, అది అన్ని భాషలకూ సోదర భాష అని కేంద్ర మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకు, అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే కొన్ని పార్టీలు భాషా అంశాన్ని తెరపైకి తెస్తున్నాయని

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# యాంటీ ఇండియా టెర్రరిస్టుల గుండెల్లో టెర్రర్

ఎప్పుడు ఎవడొస్తాడో తెలియదు! ఎలా వేసేస్తాడో అర్థం కాదు! వారి చావు ఎంత ఘోరంగా ఉంటుందో.. అస్సలు ఊహించలేరు. వారి నేల మీదే.. క్షణాల్లో ఖతమైపోతున్నారు. టెర్రర్ ఎటాక్స్‌ని ప్లాన్ చేస్తున్న టెర్రరిస్టులందరి గుండెల్లో ఇప్పుడు టెర్రర్ మొదలైంది. పాకిస్థాన్ ఉగ్రవాదులకైతే.. కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఎక్కడున్నా.. ఎంత రహస్య ప్రదేశంలో దాక్కున్నా.. వారి చావు వారిని వెతుక్కుంటూ వచ్చేస్తోంది. ఒక్కొక్కరి ప్రాణాలు తీసేస్తోంది. గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో వరుసగా హతమవుతున్నారు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు. మొన్నటికి మొన్న కుల్ భూషణ్ జాదవ్ కిడ్నాప్ వెనకున్న మతపెద్ద హతమయ్యాడు. ఇప్పుడు.. 26/11 ముంబై దాడుల ప్రధాన సూత్రధారి అయిన హాఫీజ్ సయీద్ మేనల్లుడు.. అబూ కతల్ పాకిస్థాన్‌లోనే ఖతమయ్యాడు.కొన్నాళ్లుగా గుర్తుతెలియని వ్యక్తులు అనేకమంది భారత వ్యతిరేక శక్తులను ఖతం చేస్తున్నారు. లేటెస్ట్‌గా.. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా వ్యవస్థాపకుడైన హాఫీజ్ సయీద్ మేనల్లుడు.. అబూ కతల్ హతమయ్యాడు. తన అనుచరులతో కాన్వాయ్‌లో వెళ్తుండగా.. ఒక్కసారిగా గుర్తు తెలియని వ్యక్తులు బుల్లెట్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో అబూ కతల్‌తో పాటు అతని బాడీగార్డ్స్ కూడా చనిపోయారు. నిత్యం పాకిస్థాన్ ఐఎస్ఐ నీడలో సంచరించే అబు కతల్‌ని.. ఇలా లేపేయడం హాట్ టాపిక్‌గా మారింది. హాఫీజ్ సయీద్, అబూ కతల్ హిట్ లిస్టులో ఉన్నారని ఐఎస్ఐకి తెలుసు. వాళ్లను.. పదేళ్లుగా జాగ్రత్తగా కాపాడుతూ వస్తుందనే సమాచారం ఉంది. అబూ కతల్‌కి ఐదు మారుపేర్లు ఉన్నాయి. హాఫీజ్ సయీద్.. లష్కరే తోయిబాకి చీఫ్ అయినా.. తన మేనల్లుడైన అబూ కతల్‌ని చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా నియమించాడు. ప్లాన్ హాఫీజ్ వేస్తే.. దానిని అమలు చేసేది అబు కతల్.లష్కరే తోయిబా ఉగ్రవాది అబూ కతల్.. ఇండియాలో మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా ఉన్నాడు. 2023లో రాజోరి జిల్లాలో జరిగిన ఉగ్ర దాడి, 2024 రియాసి జిల్లాలో జరిగిన బస్సు దాడిలో పాల్గొన్నాడు అబూ కతల్. ఇవి మాత్రమే కాదు జమ్మూకశ్మీర్‌లో అనేక దాడులకు ఇతనే బాధ్యుడు. అందువల్ల.. ఎన్ఐఏతో పాటు ఇండియన్ ఆర్మీ, ఇతర భద్రతా సంస్థల హిట్ లిస్టులో ఉన్నాడు. 2024 జూన్ 9న రియాసి జిల్లాలో.. శివకోరి గుహలో ఉన్న శివాలయాన్ని దర్శించుకునేందుకు వెళు్తన్న హిందూ యాత్రికుల బస్సుపై దాడి చేశారు.అబూ కతల్ నాయకత్వంలో జరిగిన ఈ దారుణమైన దాడిలో.. 9 మంది పౌరులు మరణించారు. 40 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఉగ్రదాడి తర్వాత రియాసి జిల్లాలో కొత్త భయాందోళన మొదలైంది. 2023 జనవరిలో రాజోరి జిల్లాలోని దంగ్రీ గ్రామంలో నలుగురు ఉగ్రవాదులు ప్రవేశించి.. పౌరులని లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపారు. ఈ ఉగ్రదాడిలోనూ అబూ కతల్ పాత్ర ఉంది. ఈ దాడిలో ఇద్దరు పిల్లలు సహా ఏడుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు.జమ్మూకశ్మీర్ సరిహద్దు గ్రామాల్లోని యువకులకు డబ్బు ఆశ చూపి.. లష్కరే తోయిబాలోకి రిక్రూట్ చేస్తున్నాడు అబు కతల్. అదొక్కటే కాదు.. మైనారిటీ సమాజానికి చెందిన పౌరులని, భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని ఎటాక్స్ చేయడంలో అబూ కతల్ పాత్ర ఉంటుంది. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడం, బోర్డర్ దాటి చొరబడటం, పౌరులని లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం, అశాంతి సృష్టించేందుకు ప్రయత్నించడం లాంటివన్నీ.. అబూ కతల్ కనుసన్నల్లోనే జరుగుతుంటాయి. వీటన్నింటిపై లోతైన దర్యాప్తు తర్వాత ఐదుగురు నిందితులపై ఎన్ఐఏ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. వీరిలో ముగ్గురు పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా కమాండర్లు ఉన్నారు. అందులో.. అబూ కతల్, సైఫుల్లా అలియాస్ సాజిద్ జట్, మహమ్మద్ ఖాసిం ఉన్నారు.జమ్మూకశ్మీర్‌ని అస్థిరపరిచేందుకు దాడులు ప్లాన్ చేయడం, పాకిస్థాన్ నుంచి వచ్చే సూచనల్ని అమలు చేయడం లాంటివి చేయడంలో ఇతనిదే కీలకపాత్ర. అలాంటి.. అబూ కతల్ ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో హతమవడంతో.. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదంపై పోరాటంలో.. ఓ ముఖ్యమైన పరిణామానికి నాంది పలుకుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయ్. పాకిస్థాన్ టెర్రరిస్టులకు, ఖలిస్థాన్ వేర్పాటువాదులందరికీ.. ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తుల భయం పట్టుకుంది. ఇదంతా.. కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. కొన్ని నెలలుగా నడుస్తున్న వ్యవహారమే. ఇప్పటికే.. ఈ తరహాలో చాలా మంది హతమయ్యారు. ఇక ముందు కూడా ఇది కొనసాగుతుందనే సంకేతాలిస్తున్నారు.ఊరు లేదు.. పేరు లేదు.. స్ట్రాంగ్ ఎవిడెన్స్ లేదు. ఉగ్రవాదులను ఏరిపారేస్తున్న గుర్తు తెలియని వ్యక్తుల జాడ కూడా తెలియట్లేదు. ఎవరు చంపేస్తున్నారో అస్సలు అర్థం కావట్లేదు. ఇదంతా.. మూడు నాలుగేళ్లుగా జరుగుతున్న వ్యవహారమే. ఇప్పటికే.. ఇలాంటి హత్యలు చాలానే జరిగాయ్. సిరీస్ ఆఫ్ ఈవెంట్స్‌ని చూశాక.. ఇప్పుడిప్పుడే అందరిలోనూ అనుమానం కలుగుతోంది. మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులందరినీ.. ఒకరి తర్వాత ఒకరిని హతమారుస్తున్నారు గుర్తు తెలియని వ్యక్తులు.ముఖ్యంగా.. భారత్‌కు శత్రువులుగా ఉన్న వాళ్లు, ఇండియా హిట్ లిస్టులో ఉన్న వాళ్లంతా.. విదేశాల్లో హతమైపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇలా.. గుర్తు తెలియని వ్యక్తులు దాడులు చేస్తుండటంతో.. చాలా మంది ఉగ్రవాదులు పాకిస్థాన్‌లోని రహస్య ప్రదేశాల్లో దాక్కుంటున్నారు. . లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు, జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు అత్యంత సన్నిహితులైన వాళ్లు కూడా.. గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో హతమయ్యారు. భారత వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న ఎందరో తీవ్రవాదులు, ఖలిస్థానీ ఉగ్రవాదులంతా ఒక్కొక్కరిగా ప్రాణాలు కోల్పోతున్నారు. లష్కరే తోయిబాకు చెందిన అబ్దుల్ సలామ్ భుట్టావి, జియార్ రెహమాన్, అబూ ఖాసిం, ముఫ్తీ ఖైజర్ ఫరూక్, సర్దార్ హుస్సేన్ లాంటివాళ్లంతా.. పాకిస్థాన్ గడ్డ మీదే హత్యకు గురయ్యారు. ఇక.. జైషే మహ్మద్‌కు చెందిన ఉగ్రవాదులు దావూద్ మాలిక్, షాహిద్ లతీఫ్, అతని సోదరుడు హారిస్ హాషిమ్, జహూర్ మిస్త్రీ కూడా పాక్ నేల మీదే ప్రాణాలు కోల్పోయారు.నిషేధిత ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హర్దీప్ సింగ్ నిజ్జర్ కెనడాలో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమయ్యాడు. అతనే కాదు.. ఖలిస్థాన్ ఉగ్రవాదులుగా పేరున్న సుఖ్దూల్ సింగ్, రిపూదామన్ సింగ్ కూడా కెనడాలోనే హత్యకు గురయ్యారు. అవతార్ సింగ్.. లండన్‌లో మర్డర్ అయ్యాడు. పరంజిత్ సింగ్, హర్వీందర్ సింగ్ సందూ.. లాహోర్‌లో గుర్తుతెలియని వారి చేతిలో చనిపోయారు. ఇక.. భారత్‌లో ఉగ్రదాడులకు పాల్పడిన బషీర్ అహ్మద్ పీర్, సయ్యద్ ఖలీద్ రజా, ఎజాజ్ అహ్మద్.. లాంటోళ్లంతా చనిపోయారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఎఐ-814 హైజాకర్లలో ఒకరైన మిస్త్రీ జహూర్ ఇబ్రహీంని కూడా కరాచీలో కాల్చి చంపారు.2022 నుంచి ఇప్పటివరకు ఇదే తరహాలో.. చాలా మంది ఉగ్రవాదులు, భారత వ్యతిరేక శక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఓ వైపు ఈ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్ని కనిపెట్టేందుకు భారత ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. ఇదే సమయంలో ఉగ్రవాదులంతా హత్యకు గురవడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఉన్న అనుమానాలు, ఆరోపణల మేరకు పాకిస్థాన్ సైన్యం ఎంత రక్షణ కల్పించినా.. ఏ ఉగ్రవాది కూడా సేఫ్‌గా లేడనే విషయం అర్థమవుతోంది. ఇందుకు.. వరుసగా జరుగుతున్న ఉగ్రవాదుల ఏరివేత ఎపిసోడ్లే బిగ్ ఎగ్జాంపుల్. ఏదో ఒకరోజు వాళ్లంతా.. గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో బలైపోక తప్పదంటున్నారు. ఎంత సెక్యూరిటీ ఉన్నా.. వాళ్లంతా సురక్షితంగా లేరనే విషయం తెలుస్తోంది. ఎక్కడున్నా.. ఎలాంటి చోట దాక్కున్నా.. ఎంత సేఫ్‌గా ఉన్నామని అనుకున్నా.. ఏదో ఒక రోజు చావు వాళ్ల దాకా వెళ్తుందనే విషయం.. ఇప్పటికే అర్థమై ఉంటుందంటున్నారు.

# నీ ఋణం తీర్చుకోగలమా బాబు...!

"సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ ఒక నిర్ణయం తీసుకుంది. సామాజిక న్యాయం తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం. ఒకరికే కాదు, అందరికీ న్యాయం జరగాలి. అందుకే 1996-97లలో రామచంద్ర రాజు కమిషన్ వేసి ఆర్థిక పరిస్థితులన్నీ అధ్యయనం చేసిన తర్వాత ఎస్సిలలో ఏ, బి, సి, డి వర్గీకరణ నేనే తీసుకొచ్చా. తర్వాత అది కోర్టులలో చాలెంజ్ అయ్యింది. ఈరోజు ఏడుగురు సభ్యుల ధర్మాసనం దానిని ఆమోదించారు. జనాభా దామాషా ప్రకారం ప్రతి కులానికి న్యాయం చేయడం తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం"

**ఎస్సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం చంద్రబాబు**


"షెడ్యూల్ కులాల వర్గీకరణ అనేది గతంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం అమలు చేసింది. ఆనాడు ఆంధ్రప్రదేశ్ లో ఎస్సీ వర్గీకరణ చేసింది చంద్రబాబునాయుడే, ఈరోజు తీర్పు వచ్చే సమయానికి ఆంధ్రప్రదేశ్లో మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడే ఉన్నారు. అప్పుడు ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబునాయుడుకి మేము ప్రత్యేకంగా ధన్యవాదాలు చెబుతున్నాం. ఆనాడు ఆయన వర్గీకరణ చేయకపోతే వేలాది ఉద్యోగాలు మాకు వచ్చేవి కావు. విద్యావకాశాలు మాకు వచ్చేవి కావు. ఈరోజు న్యాయం బతికింది అంటే ఆ రోజు ఆయన తీసుకొచ్చిన చట్టమే. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్లో చంద్రబాబు అధికారంలో ఉండడం మా జాతి భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది. త్వరలో వర్గీకరణ జరుగుతుందనే సంపూర్ణ విశ్వాసం మాకు ఉంది."

**సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాదిగ**

చంద్రబాబు వ్యాఖ్యలు వర్గీకరణపై ఆయన చిత్తశుద్ధిని తెలియజేస్తుంటే, మందకృష్ణ మాదిగ వ్యాఖ్యలు మాదిగలకు చంద్రబాబు మీద ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తున్నాయి. ఆ చిత్తశుద్ధి, నమ్మకాలు కార్యరూపం దాల్చాయి. దశాబ్దాల మాదిగల ఆకాంక్ష నెరవేరింది. ఎస్సీ వర్గీకరణ పై వేసిన కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికను ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదించి, అసెంబ్లీలో ప్రకటన చేసింది. ఇక ఆర్డినెన్స్ లాంచనమే కావడంతో ఆంధ్రప్రదేశ్ లోని మాదిగల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

**చరిత్రలోకి వెళ్ళితే...:**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషి ఫలితంగా దళితులకు వచ్చిన రిజర్వేషన్లలో (ఆంధ్రప్రదేశ్లో 15%) సింహభాగం ఒక్క సామాజివర్గానికే వెళ్తున్నాయని దళితులందరికీ వారి జనాభా దామాషా ప్రకారం పంపిణీ చేపట్టాలని సంకల్పంతో 1994 జులై 7న మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా, ఈదుమూడి గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భవించింది. ఉమ్మడి రిజర్వేషన్ విధానం వల్ల నష్టపోతున్న మాదిగలను సమీకరించి, బీసీలలో ఉన్న విధంగానే ఎస్సీలను కూడా ఎ, బి, సి, డి లుగా వర్గీకరించాలని తద్వారా విద్యా, ఉద్యోగ అవకాశాలు ఎమ్మార్పీఎస్ అనేక విధాలుగా పోరాటాలు చేసింది. ఇందులో భాగంగా మందకృష్ణమాదిగ 1997 ఏప్రిల్ 14న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తల్లి గారైన అమ్మన్నమ్మ ఆశీర్వాదం తీసుకుని, వారి స్వగ్రామమైన నారావారి పల్లె నుండి హైదరాబాద్ వరకు 1052 కి.మీ. మాదిగ మహా పాదయాత్ర పేరిట పాదయాత్ర చేసి ఎస్సీ వర్గీకరణకు అన్ని వర్గాల మద్దతు కూడగట్టాడు.



కృష్ణ మాదిగ చేస్తున్న ఉద్యమంలో నిజాయితీ, వాస్తవాలు గ్రహించిన చంద్రబాబు ఆ ఉద్యమాన్ని గుర్తించి, గౌరవించి దళితుల అసమానతలు తెలుసుకోవడానికి 1996 సెప్టెంబర్ 10న జస్టిస్ రామచంద్ర రాజు కమిషన్ ను నియమించాడు. ఆ కమిషన్ ఎస్సీల్లో అసమానతలు నిజమేనని గుర్తించి, 1997 మే 28న ఎస్సీలను ఎ, బీ, సీ, డి లుగా వర్గీకరించాలని, ఏ గ్రూపులో రెల్లి మరియు ఉప కులాలకు 1%, బి గ్రూపులో మాదిగ మరియు ఉప కులాలకు 7%, సీ గ్రూపులో మాల మరియ ఉపకులాలకు 6%, డి గ్రూపులో ఆది ఆంధ్ర కులానికి 1% కేటాయించాలని ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దరిమిలా చంద్రబాబు ప్రభుత్వం 1997 జూన్ 6న ఎస్సీలను ఎ, బి, సి, డి లుగా వర్గీకరిస్తూ ఆర్డినెన్స్ ను విడుదల చేసింది. అయితే జాతీయ ఎస్సీ కమిషన్ ను సంప్రదించలేదన్న కారణంతో 1997 సెప్టెంబర్ 18న రాష్ట్ర హైకోర్ట్ ఆ ఆర్డినెన్సు కొట్టివేసింది. తర్వాత చంద్రబాబు నాయుడు 2000 సంవత్సరం మే లో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని చేశాడు.

చట్టం అమలు కాలమైనా 2000-2004 సంవత్సరాల మధ్యకాలంలో మాదిగలు 24 వేల పైచిలుకు ఉద్యోగాలు పొందారని గణాంకాలు చెప్తున్నాయి. అయితే 2004లో చంద్రబాబు నాయుడు అధికారం కోల్పోయిన తర్వాత నవంబర్ 6, 2004 సంవత్సరంలో రాష్ట్రాలకు వర్గీకరణ చేసే అధికారం లేదని సుప్రీంకోర్టు ఈవి చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో చంద్రబాబు చేసిన చట్టాన్ని కొట్టేసింది. 2004 లో చంద్రబాబు అధికారం కోల్పోవడం వల్ల మాదిగ జాతి తీవ్రంగా నష్టపోయిందని ఇప్పటికీ మాదిగలు బలంగా నమ్ముతారు. 2004లో ఏ సుప్రీంకోర్టు అయితే రాష్ట్రాలకు ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం లేదని చెప్పి చంద్రబాబు చేసిన చట్టాన్ని కొట్టేసిందో, 20 ఏళ్ల తర్వాత అదే సుప్రీంకోర్టు రాష్ట్రాలు వర్గీకరణ చేయవచ్చు అని తెలిపింది. దీని ద్వారా 20 ఏళ్ల క్రితం చంద్రబాబు చేసిన వర్గీకరణ చట్టం న్యాయమని చెప్పకనే చెప్పింది.

ఎస్సీ వర్గీకరణకు తెలుగుదేశం పార్టీ కృషి చేసినంతగా మరే పార్టీ చేయలేదంటే అతిశయోక్తి కాదు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా 2012 అక్టోబర్ 10న వర్గీకరణపై పార్లమెంట్లో బిల్లు పెట్టమని చంద్రబాబు ప్రధానికి లేఖ రాశారు. ఆయన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు చేసిన వస్తున్నా మీకోసం పాదయాత్రలో ఎస్సి వర్గీకరణ చేసి పెద్ద మాదిగ అనిపించుకుంటానని మాదిగలకు మాట ఇచ్చాడు. 2014- 2019 మధ్య చంద్రబాబు నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దళితుల జనాభా నిష్పత్తి ఆధారంగా నిధులు ఖర్చు చేయడానికి జీవో నెంబర్ 25 విడుదల చేసి అమలు చేశాడు. ఆగస్టు 1 2024న సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఆ తీర్పును స్వాగతించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సివర్గీకరణ అమలు కార్యాచరణలో భాగంగా 2024 నవంబర్ 15న విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాతో వన్ మాన్ కమిషన్ నియమించాడు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ 27 నవంబర్ 2024న బాధ్యతలు స్వీకరించి రాష్ట్రంలోని అన్ని జిల్లాలను పర్యటించి, వారి వద్ద నుండి 3820 వినతులను స్వీకరించి, దళితుల స్థితిగతులను అధ్యయనం చేసి ఎస్సీలను మూడు గ్రూపులుగా చేసి ఏ గ్రూపులో రెల్లి మరియు ఉపకులలకు 1%, బి గ్రూపులో మాదిగ మరియు వారి ఉపకులాలకు 6.5%, సీ గ్రూపులో మాల మరియు వారి ఉప కులాలకు 7.5% కేటాయించాలని సిఫారసు చేసి, తన నివేదికను మార్చి 10, 2025న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. మార్చి 17, 2025న రాష్ట్ర మంత్రివర్గం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫారసులను ఆమోదించి, మార్చి 20, 2025 అసెంబ్లీలో ప్రకటన చేసింది.

**నాడు నేడు బాబే:** మాదిగల దశాబ్దాల కలయైనా ఎస్సీ వర్గీకరణను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారి 1997లో చేసింది చంద్రబాబే. 27 ఏళ్ల తర్వాత ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్ లో కూడా వర్గీకరణ అమలు చేయనున్న ఘనత ఆయనకే దక్కింది. సామాజిక నిచ్చెనమెట్ల వ్యవస్థలో అణగదొక్కబడిన దళితుల్లో కూడా వైరుధ్యాలు ఉన్నాయని గుర్తించి,

అందరికీ సమానత్వం అనే సత్యాన్ని వర్తింప చేయడానికి ఎస్సి వర్గీకరణ చేసిన చంద్రబాబుపై కొన్ని పార్టీలు వర్గీకరణపై అపోహలు రేకెత్తించిన కారణంగా దళితుల్లో ఒక వర్గం ఆ పార్టీకి దూరమవడం బాధాకరం. అయినప్పటికీ మాదిగలకు ఇచ్చిన మాట కోసం, సామాజిక న్యాయం కోసం చంద్రబాబు ఎస్సి వర్గీకరణపై చేసిన కృషికి మాదిగలు జీవితాంతం ఆయనకు ఋణపడి ఉంటారనడంలో సందేహం లేదు. నిజానికి వర్గీకరణ వల్ల ఏ వర్గానికి నష్టం జరగదు. ఆయా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కోటా కేటాయింపులు జరుగుతాయి.

-గెద్దం గణేష్,
ఎం.ఎస్సీ., బి.యిడి
మాదిగ ఉద్యోగ సమాఖ్య నాయకుడు
పైడిమెట్ట

# హిందీ ఏ భాషకూ పోటీ కాదు..

- మొదటి పేజీ తరువాయి

ఆయన ఆరోపించారు. భాష పేరిట దేశంలో ఇదివరకే చాలా విభజన జరిగిందని, ఇకపై ఎంతమాత్రం అలా జరగనివ్వబోమని ఆయన అన్నారు.దరాజ్యసభలో ఆయన మాట్లాడుతూ, కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం భాషను వివాదాస్పదం చేస్తున్నాయని మండిపడ్డారు. భాష పేరుతో వారు తమ అవినీతిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దేశంలోని అన్ని భాషలూ భారత్‌కు ఒక నిధి వంటివని ఆయన అభివర్ణించారు. భాష పేరిట విభజన తీసుకువచ్చేందుకు చేసే ప్రయత్నాలు ఏవీ సఫలం కావని అమిత్ షా పేర్కొన్నారు.మోదీ ప్రభుత్వం రాజ్యభాషా విభాగాన్ని ఏర్పాటు చేసిందని ఆయన గుర్తు చేశారు. తెలుగు, తమిళం, పంజాబీ, అస్సామీ వంటి అన్ని భాషలకూ ప్రాచుర్యం కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు.దక్షిణాది భాషలకు కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకమని

కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగైతే తాను గుజరాత్ నుండి, నిర్మలా సీతారామన్ తమిళనాడు నుండి ప్రభుత్వంలో మంత్రులుగా ఎలా వ్యవహరిస్తున్నామని ఆయన ప్రశ్నించారు. ఇంజినీరింగ్, మెడికల్ విద్యను తమిళంలో అందించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని రెండేళ్లుగా కోరుతున్నామని, కానీ ఆ దిశగా అడుగులు పడటం లేదని ఆయన విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే మెడికల్, ఇంజినీరింగ్ విద్యను తమిళంలో అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# ఇండియాలో టాప్-10 రిచ్చెస్ట్ ఎమ్మెల్యేలు వీళ్లే..

- మొదటి పేజీ తరువాయి

కేహెచ్ పుట్టస్వామి గౌడ 12 వందల 67 కోట్లతో మూడో స్థానంలో నిలిచారు. నాలుగో స్థానం కూడా కర్ణాటక ఎమ్మెల్యేకే దక్కింది. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రియకృష్ణ 11 వందల 56 కోట్లతో 4వ స్థానంలో నిలిచారు. దేశంలో సగం మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులువరుసగా ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది స్థానాల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకటైన ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేలు నిలిచారు. ఏపీ ముఖ్యమంత్రి, కుప్పం ఎమ్మెల్యే నారా చంద్రబాబు నాయుడు 9 వందల 31 కోట్ల ఆస్తులతో ఐదో స్థానంలో నిలవగా, ఏపీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ 8 వందల 24 కోట్ల ఆస్తితో ఆరో స్థానంలో ఉన్నారు. ఇండియాలోని టాప్ టెన్ రిచ్చెస్ట్ ఎమ్మెల్యేల్లో ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఏడో స్థానంలో ఉన్నారు.ఏడీఆర్ రిపోర్ట్ ప్రకారం.. పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆస్తి 7 వందల 57 కోట్లు. నెల్లూరు జిల్లా కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి 7 వందల 16 కోట్లతో 8వ స్థానంలో నిలిచారు. 9వ స్థానంలో గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే జయంతిభాయ్ సోమాభాయ్ పటేల్ 6 వందల 61 కోట్లతో ఉండగా, టాప్ 10లో చివరి స్థానంలో కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేషా బీఎస్ 6 వందల 48 కోట్లతో నిలిచారు. రాష్ట్రాల వారీగా చూసుకుంటే ఈ టాప్ టెన్ రిచ్చెస్ట్ ఎమ్మెల్యేల జాబితాలో నలుగురు ఆంధ్రా ఎమ్మెల్యేలు, నలుగురు కర్ణాటక ఎమ్మెల్యేలు ఉండటం గమనార్హం. మిగిలిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేల్లో ఒకరు మహారాష్ట్ర, మరొకరు గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారు కావడం గమనార్హం.

ఇండియాలో టాప్-10 ధనిక ఎమ్మెల్యేల జాబితా-2025

1. పరాగ్ షా (బీజేపీ, మహారాష్ట్ర) %-% రూ. 3,383 కోట్లు
2. డీకే శివకుమార్ (కాంగ్రెస్, కర్ణాటక) %-% రూ. 1,413 కోట్లు
3. కేహెచ్ పుట్టస్వామి గౌడ (స్వతంత్ర ఎమ్మెల్యే, కర్ణాటక) %-% రూ.1,267 కోట్లు
4. ప్రియకృష్ణ (కాంగ్రెస్, కర్ణాటక) %-% రూ.1,156 కోట్లు
5. నారా చంద్రబాబు నాయుడు (టీడీపీ, ఆంధ్రప్రదేశ్) %-% రూ. 931 కోట్లు
6. పొంగూరు నారాయణ (టీడీపీ, ఆంధ్రప్రదేశ్) %-% రూ. 824 కోట్లు
7. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి (వైఎస్ఆర్ సీపీ, ఆంధ్రప్రదేశ్) %-% రూ. 757 కోట్లు
8. వేమిరెడ్డి. ప్రశాంతి రెడ్డి (టీడీపీ, ఆంధ్రప్రదేశ్) %-% రూ. 716 కోట్లు
9. జయంతిభాయ్ సోమాభాయ్ పటేల్ (బీజేపీ, గుజరాత్) %-% రూ. 661 కోట్లు
10. సురేషా బీఎస్ (కాంగ్రెస్, కర్ణాటక) %-% రూ. 648 కోట్లు

# పోసానికి ఊరట... సీఐడీ కేసులో బెయిల్ మంజూరు

- మొదటి పేజీ తరువాయి

శుక్రవారానికి వాయిదా వేసింది. తిరిగి నేడు విచారణ జరిపి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పోసాని, తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ న్యాయవాదుల ద్వారా సీఐడీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కోర్టు తీర్పును వాయిదా వేసింది.కాగా, పోసానిని ఫిబ్రవరి 26న హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. ఏపీలో ఆయనపై 19 కేసులు నమోదైనట్టు తెలుస్తోంది. అవార్డులకు సంబంధించిన సినీ పరిశ్రమలో విద్వేషాలు రగిల్చే వ్యాఖ్యలు చేశారని... చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆయనపై ఫిర్యాదులు అందడంతో కేసులు నమోదు చేశారు.

# వేంకటేశ్వరుడి ప్రాణభిక్షతోనే బతికున్నా

- మొదటి పేజీ తరువాయి

ఎన్టీఆర్ ప్రారంభించారన్నారు. ఇప్పటికి విరాళాల ద్వారా రూ.2,200 కోట్లు కార్పస్ ఫండ్ ఏర్పాటైందని, అన్నదానం ఒక మహత్తర కార్యక్రమమని సీఎం అభివర్ణించారు. ఇది శాశ్వతంగా జరుగుతుందన్నారు. తాను ప్రాణదానం కార్యక్రమం ప్రారంభించానని, మానవ సేవ మాధవ సేవ రెండూ ఉంటాయని ప్రాణదానం తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రాణదానం కార్యక్రమం ప్రారంభించి కిందకు వస్తున్న సమయంలోనే తనపై 24 క్లేమోర్‌మైన్స్ పేల్చారని తెలిపారు. అన్ని క్లేమోర్స్ పేల్చినా తాను ప్రాణాలతో ఉన్నానంటే దానికి కారణం సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి ప్రాణభిక్ష పెట్టడమేనని అన్నారు. ఎవరైనా సరే... 24 క్లేమోర్ మైన్స్ పేలితే ప్రాణాలతో తప్పించుకోలేరని, తాను కేవలం వేంకటేశ్వరస్వామి మహిమ వల్లే బతికానని చెప్పుకొచ్చారు.

## హరీశ్ రావు 'బుద్ధిమాంద్యం' వ్యాఖ్యలపై

# శాసనసభలో దుమారం

- మొదటి పేజీ తరువాయి

మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.హరీశ్ రావు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుండా మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తరహాలో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.అందుకు హరీశ్ స్పందిస్తూ.. బుద్ధిమాంద్యం అనే పదం ఏమైనా తప్పా అని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బట్టలూడదీసి కొడతా, బట్టలిప్పి ఊరేగిస్తానని మాట్లాడితే వారిని ఎందుకు వారించలేదని ఆయన స్పీకర్‌ను అడిగారు. తాను బుద్ధిమాంద్యం అంటే తప్పెలా అవుతుందని, దీనిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు.హరీశ్ రావు విజ్ఞులైతే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని భట్టివిక్రమార్క సూచించారు. సభాపతితో వాదన సరికాదని ఆయన అన్నారు. హరీశ్ రావు స్పందిస్తూ, స్పీకర్ పట్ల తమకు గౌరవభావం ఉందని అన్నారు. స్పీకర్ అందరికీ పెద్దన్నలాంటి వారని, తమ ఆవేదనను స్పీకర్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.

# తెలంగాణ హైకోర్టులో వైఎస్ వివేకానంద కూతురు సునీత పిటిషన్

- మొదటి పేజీ తరువాయి

పిటిషన్‌పై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇప్పటికే దాదాపు నాలుగేళ్లుగా ఈ కేసు విచారణ కొనసాగుతున్నప్పటికీ పురోగతి ఏమీ లేదని, సునీత ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు.హైకోర్టులో విచారణ సందర్భంగా సునీత తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. 2019 మార్చి 14వ తేదీ అర్ధరాత్రి హత్య జరిగిందని, విచారణ జరిపిన సీబీఐ అధికారులు ఇప్పటికే రెండు ఛార్జీషీట్లు దాఖలు చేశారని పేర్కొన్నారు. సీబీఐ కోర్టులో విచారణ కొనసాగుతోందని, దీనిని ఆరు నెలల్లో ముగించేలా కోర్టును ఆదేశించాలని కోరారు.సీబీఐ అధికారులు హార్డ్ డిస్క్‌లను ప్రతివాదులకు ఇచ్చారని, అవి తెరుచుకోవడం లేదని, దీంతో పదిహేను నెలలుగా విచారణ ముందుకు సాగడం లేదని హైకోర్టుకు తెలిపారు. సునీత ప్రధానంగా సీబీఐ అధికారులతో పాటు తన తండ్రి హత్య కేసులో నిందితులుగా ఉన్నవారందరినీ ప్రతివాదులుగా చేర్చారు. ఈ అంశంపై విచారణ జరిపిన ప్రత్యేక ధర్మాసనం సీబీఐతో పాటు ఈ కేసులో నిందితులందరికీ నోటీసులు వ్యక్తిగతంగా ఇచ్చేందుకు సునీత న్యాయవాదికి అనుమతి ఇచ్చింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

పెన్ పవర్ ప్రకాశం

## జాతీయ నాయకుల ఫోటోల పక్కన

# ఎమ్మెల్యే ఫోటోలా..!

**జాతీయ నాయకులతో సమానమా అంటు విమర్శలు**

**ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి స్థాయితో ఎమ్మెల్యే ఫోటో**

**అవాక్కవుతున్న మండల ప్రజలు**

**ఇదే కొనసాగితే ముందు ముందు రోజుల్లో ఎంపీపీ జెడ్పీటీసీ, సర్పంచ్ వార్డు మెంబర్లు ఫోటోలు గోడపై కి**





**పీసీపల్లి పెన్ పవర్ మార్చి 21**

ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఫోటోలు పెట్టాలని ఆదేశాలు రావడం తెలిసిందే. మరి ఆ అధికారులకు అంత లవ్వు ఎందుకో పుట్టిందో ఏమో మరి .ఎమ్మెల్యే దగ్గర మార్కులు కోట్టాలని ఆశించారో ఏమో గాని ఏకంగా జాతీయ నాయకుల ప్రక్కన ముఖ్యమంత్రి,ఉపముఖ్యమంత్రి ఫోటోలు పెట్టడం ఎమ్మెల్యే ఫోటోను వారి సరసన చేర్చడం చర్చనీయాంశం గా మారింది. వివరాల్లోకి వెళితే వెంగళాయపల్లి, పెద ఇర్లపాడు సచివాలయంలో గాంధీజి, ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి ఫోటోల పక్కన ఏకంగా కనిగిరి ఎమ్మెల్యే ఫోటోను పెట్టడం పెన్ పవర్ పరిశీలనలో బట్టబయలైంది.. రాజ్యాంగ నిర్మాత బాబా సాహేబ్ అంబేద్కర్ ,స్వాతంత్ర్యం కోసం పోరాడిన బాపూజి మహాత్మ గాంధిజి చిత్రపటాల ప్రక్కనే ప్రాధాన్యత ఇస్తూ ఎమ్మెల్యే ఫోటోను పెట్టి, చంద్రబాబు,పవన్ కళ్యాణ్ ల ఫోటొలను చివరగా చేర్చడం వివాద స్పదంగా మారింది. పార్టీ మీద ప్రేమ ఉంటే,ఎమ్మెల్యేను హైలెట్ చేస్తే తమ మీద ప్రేమను ఒలక బోస్తారని ఆశించిన అధికారులు ఈ వికృత చేష్టలకు తెరలేపారు. ఇదే పద్ధతి కొనసాగితే రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి ఫోటో పక్కన ఎంపీపీ జెడ్పీటీసీ , సర్పంచ్ వార్డు మెంబర్లు ఫోటోలు గోడపై కి ఎక్కే పరిస్థితి వస్తుందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

**ఫోటోలు ఉండకూడదు తప్పే**

ఈ విషయంపై స్థానిక ఎంపీడీఓ ప్రభాకర్ శర్మను వివరణ కోరగా ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి ఫోటోల పక్కన ఎమ్మెల్యే ఫోటో పెట్టిన సంగతి తనకు తెలియదని ఎమ్మెల్యే ఫోటోలు ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్ట కూడదన్నారు. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ఫోటోలు తీయిస్తానని చెప్పారు.

పెన్ పవర్ ఎఫెక్ట్ EXCLUSIVE

**పైపులైన్లను మరమ్మతులు చేపట్టిన అధికారులు**

# పెన్ పవర్ వార్తకు స్పందన

**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 21**

'పగిలిన పైపులైన్ రోడ్లపై వృధాగా నీటి ప్రవాహం' 'పైపులైన్లను మరమ్మతులు చేపట్టి నీళ్లు ఇవ్వాలి'అనే శీర్షిక ను పెన్ పవర్ దినపత్రికలో శుక్రవారం కథనం వెలువడింది ఈ వార్తకు స్పందించిన అధికారులు వెంటనే పెద్ద రాజుపాలెం పంచాయితీ పరిధిలోని ఆర్ అండ్ బి రోడ్ నుండి ఎగువపల్లి గ్రామమునకు పోయే త్రాగునీటి పైపులు పగిలిపోయి నీరు వృధాగా బయటకి ప్రవహిస్తున్న పైపులైను గుర్తించి మరమ్మతులు చేపట్టారు ఈ సందర్భంగా వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా మరమ్మతులు చేపట్టి ప్రజలకు త్రాగునీటి సౌకర్యం కల్పించినందుకు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి కి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మోహన్ రావు కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


పగిలిన పైప్ లైన్ రోడ్లపై
వృధాగా నీటి ప్రవాహం
పైపులైన్లను మరమ్మతులు చేపట్టి నీళ్లు ఇవ్వాలి








**గ్రామాల..రైతుల అభివృద్ధి కోసం**

# ఉపాధి హామీ పథకం

**జిల్లా కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 21**

ఉపాధి హామీ పథకాన్ని గ్రామాల అభివృద్ధి, రైతుల అభివృద్ధి కోసం మరింత సమర్ధవంతంగా అమలు చేయడానికి సంకల్పించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, సైన్స్ %ఇ% టెక్నాలజీ శాఖామంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం విజయవాడ కార్యాలయం నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఫారం పాండ్లు ఏర్పాట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల పురోగతి, గోకులాల నిర్మాణాల పురోగతి తదితర అంశాల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గ్రామీణ పేద ప్రజలకు ఉపాధి హామీ పథకం ఒక వరం అని, ఈ పథకం ద్వారా 57.91 లక్షల కుటుంబాలకు చెందిన 97.42 లక్షల మంది ఉపాధి కూలీలకు వారి సొంత గ్రామాల్లోనే రోజువారి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి దాకా 23.47 కోట్ల పనిదినాలు కల్పించామన్నారు. 4.24 లక్షల కుటుంబాలకు 100 రోజుల పని కల్పించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటి వరకు ఈ పథకం కింద మొత్తం 9561 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం , అందులో 5991 కోట్ల రూపాయలు ఉపాధి కూలీలకు, 3570 కోట్ల రూపాయలు మెటీరియల్ కింద ఖర్చు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల కి.మీ.ల సిసి రోడ్లను మొదలు పెట్టి, 3,346 కి.మీ.ల సిసి రోడ్లను ఇప్పటి వరకు పూర్తి చేయడం జరిగిందని, తెలుగు నూతన సంవత్సరం, ఉగాది పండుగ సందర్భంగా మార్చి 29వ తేది నుండి వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సిసి రోడ్లను రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సుస్థిర ఆస్తుల కల్పన, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం లో 22,500 గోకులాలు మొదలు పెట్టి, ఇప్పటి దాక 19,325 గోకులాలు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. గోకులాల వల్ల గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడి, పాల ఉత్పాదకత సగటున ఒక్కో పశువుకు రోజుకు 2 లీటర్లు పెరిగిందని, ఫలితంగా ప్రతి రైతుకు నెలకు 12 వేల రూపాయల అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మార్చి 22 తేదిన 1,55,000 ఫారం పాండ్లను రైతుల పొలాల్లో చేపట్టి ఒక టిఎంసిల నీటిని సంరక్షించేలా ముందుకు వెళ్ళాలని, ప్రస్తుతం తవ్వే ఫారం పాండ్లు కేవలం నీటి నిల్వకే కాకుండా రైతులకు ఆదాయం ఇచ్చే పంట సంజీవని లా మార్పు చేస్తున్నామన్నారు. ఈ ఫారం పాండ్ల నిర్మాణం వలన రైతులకు అనేక లాభాలున్నాయి. వర్షపు నీటిని సేకరించి, పొలాలకు అవసరమైన సమయంలో వాడుకోవచ్చన్నారు. రైతులను చైతన్య పరిచి త్వరితిగతిన ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 1.55 లక్షల ఫారం పాండ్లను పూర్తి చేయాలన్నారు. అలాగే ఏప్రిల్, మే, జూన్ నెలలో పెద్ద ఎత్తున హాజరయ్యే కూలీలకు పని ఇవ్వడానికి అధికార యంత్రాంగం సమాయత్తంగా వుండాలన్నారు. వేసవి కాలంలో పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు తీసుకోవలసిన జాగ్రత్తలు పని సమయాలు కూలీల సౌలభ్యం మేరకు ఉండాలని సూచించారు. సగటు కూలి రేటును రూ.300/-లకు పెంచేలా కూలీలకు, మేట్లకు అవగాహన పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలి. వేతన పర్యవేక్షణ కమిటీలను ( డబ్ల్యూఎంసీ) ఏర్పాటు చేసి సగటు కూలి రేటును పెంచడానికి చర్యలు తీసుకోవడం తో పాటు అవినీతిని తగ్గించడానికి ఫ్లయింగ్ స్క్వాడ్ ను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అవినీతికి పాల్పడిన సిబ్బందిని ఉద్యోగం నుండి తొలగించడం, శాఖాపరమైన చర్యలు చేపట్టి జవాబుదారితనం పెంచుతున్నామన్నారు. ఉపాధి హామీ పథకాన్ని క్షేత్ర స్థాయిలో పారదర్శకతతో అమలు చేయడానికి జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఒంగోలు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకట నాయుడు, పంచాయతీ రాజ్ ఎస్.ఈ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

**సూక్ష్మ..చిన్న..మధ్యతరహా సంస్థల**

# అభివృద్ధిపై మాగుంట ప్రశ్న



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 21**

దేశం, ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లాలో స్వావలంభన ఇండియా నిధి పథకం (ఎస్ ఆర్ఐ ఫండ్) ఏర్పాటుపై పరిశోధన, సర్వే, అధ్యయనం, దరఖాస్తు చేసిన సంస్థలు, కేటాయించిన,వాడిన నిధులు, విస్తరణ చర్యలు, అవగాహన కార్యక్రమాల అమలు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నను లేవనెత్తారు. కేంద్ర సూక్ష్మ, చిన్న మధ్యతరహా సంస్థల శాఖ సహాయక మంత్రి, సుశ్రీ శోభా కరంద్లాజే సమాధానమిస్తూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు పెరుదలకు, పెద్ద యూనిట్లుగా మారడానికి స్వావలంభన ఇండియా నిధి పథకం క్రింద రూ 50,000 కోట్లు ఈక్విటీ ఫండ్ ఏర్పాటు చేయబడిందని, దీని క్రింద ఫిబ్రవరి 28-2025 నాటికి దేశం మొత్తంలో 577 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు లబ్ధి పొందగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 3 సంస్థలు లబ్ధి పొందాయని తెలిపారు.

ఈ పథకం కేంద్రానిది కనుక రాష్ట్రాలకు నిధులు విడుదల చేయబడవని, జాబితాలో 60 రకాల నిధులు చేర్చబడ్డాయని, 577 సంస్థలకు రూ.10,979 కోట్లు సహాయం అందజేయబబడిందని, ఎన్ వి సి ఎఫ్ ఎల్ సంస్థకు రూ. 1,722 కోట్లు ఇవ్వగా, రూ.1,642 కోట్లు ఖర్చుచేయడం జరిగిందని తెలిపారు. దేశంలోని సంస్థలు పరిశ్రమ సంఘాలకు ఈ పథకం గురించి అవగాహన కల్పించుటకు సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా సంస్థల మంత్రిత్వ శాఖ,ఎన్ వి సి ఎఫ్ ఎల్ సంస్థ వర్క్ షాపులను సమావేశాలను నిర్వహిస్తున్నాయని కేంద్రమంత్రి తెలియజేశారు.

# క్రికెట్ బెట్టింగ్ లు పాల్పడితే కఠిన చర్యలు

## - జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్




**క్రైం రిపోర్టర్ ఒంగోలు,పెన్ పవర్ మార్చి 21**

క్రికెట్ బెట్టింగ్ ల జోలికెళ్ళి జీవితాలు నాశనం చేసుకోవద్దని బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగు నిర్వాహకులు, పందెంరాయుళ్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడినా, నిర్వహించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమాయక ప్రజలను, యువకులను లక్ష్యంగా చేసుకొని, ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చని ఆశలు రేకెత్తించేలా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ అమాయకులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లు జరుగునున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిఘా పెట్టడం జరిగిందని, క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడే కొంత మంది వ్యక్తులను గుర్తించడం కూడా జరిగిందన్నారు. క్రికెట్ బెట్టింగులతో సంబంధాలు ఉన్న పాత నేరస్తులను కూడా బైండోవర్ కేసులు నమోదు చేయటం జరిగిందని, యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ చట్టవిరుద్ధం, ఇది ఆర్థికంగా, సామాజికంగా జీవితాలను నాశనం చేస్తుందని, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అవి మోసపూరితంగా ఉండవచ్చునని, క్రికెట్ బెట్టింగ్ వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. వినోదం కోసం మాత్రమే క్రికెట్ మ్యాచ్ లు చూడాలని, బెట్టింగులు వైపు మొగ్గు చూపకూడదని, క్రికెట్ బెట్టింగు యాప్ లలో బాల్ టు బాల్ పందేలు వేసే వీలుండటం, ఆకర్షణీయమైన మాటలు నమ్మి అత్యాశకు పోయి జీవితాలు నాశనం చేసుకోకూడదని, శ్రమించకుండా వచ్చే నగదు వెనుక అనేక నష్టాలు దాగి ఉంటాయని యువత గుర్తెరగాలని, కేసుల్లో నిందితులుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి పెట్టాలని, తమ తల్లిదండ్రుల కోసం ఉన్నతంగా బ్రతకాలని, బెట్టింగ్ రాయుళ్ళ వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఏ.పి జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడమే కాకుండా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అవసరమైతే సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే సదరు సమాచారాన్ని డయల్ 112/100 కు లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ కు 9121102266 సమాచారమివ్వాలని సూచించారు.

# ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవ వేడుకలు





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మార్చి 21**

నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం), కళామిత్రమండలి ( తెలుగు లోగిలి) సంస్థల సంయుక్త నిర్వహణలో శుక్రవారం ఉదయం స్థానిక జిల్లా గ్రంథాలయంలో ప్రపంచ కవితా దినోత్సవ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభకు నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ "ప్రపంచమొక పద్మ వ్యూహం కవిత్వం తీరని దాహం"అంటూ శ్రీ శ్రీ అన్న మాటలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని, అందుకే సమాజంలో ప్రతి ఒక్క కవి బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, అందుకోసం కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని రచనలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ సామాజిక రుగ్మతలతో బాధపడుతున్న వారిని సరైన దిశకు మళ్ళించి దిశానిర్దేశం చేసేలా కవిత్వం ఉండాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు.మరో అతిథి నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ కవిత్వం, సాహిత్యం ఎప్పుడూ సమాజ శ్రేయస్సునే కోరుకుంటుందని అందుకే మేమంతా సాహిత్య మార్గాన్ని ఎంచుకున్నామని తెలిపారు. తర్వాత కళామిత్రమండలి సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు సంచాలకత్వంలో కవి సమ్మేళనం జరిగింది. విశిష్ట అతిథులుగా విచ్చేసిన పోతుల పెదవీరనారాయణ,కుర్రా ప్రసాద్ బాబు, ఓరుగంటి ప్రసాద్, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు,మిడసల మల్లికార్జునరావు,బీరం అరుణ తదితరులు ప్రసంగించారు . ఇదే రోజు ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని అటవీశాఖ విశ్రాంత అధికారి గుంటూరు సత్యనారాయణ మాట్లాడారు. సభానంతరం ఆహ్వాన కమ్మేళనం పాల్గొన్న కవులను, కవయిత్రులను ఘనంగా సన్మానించారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు,కవయిత్రులు యం.సూర్యకుమారి, శ్రీమతిపి. రాజ్యలక్ష్మి,డా. మున్నంగి రాజకుమారి, డా.సిహెచ్ ఉదయజానకి, రామచంద్రుని లక్ష్మి , పరాంకుశం కృష్ణవేణి ,బీరం అరుణ , బండారు సునీత,జి.పద్మజ, యన్ . నరసమ్మ, యు.వి రత్నం , పిన్ని వెంకటేశ్వర్లు ,నిమ్మల వెంకయ్య,గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్ ,కేయస్వీ ప్రసాద్ , చుండూరి శ్రీనివాసరావు , పాలూరి శివ ప్రసాద్ ,జి.వి. శేషగిరిరావు ,ఇనకొల్లు మస్తానయ్య ,పిల్లి హజరత్తయ్య, నర్సింగోలు శ్రీనివాస ప్రసాద్, కందుల మధు,శింగరాజు శ్రీనివాసరావు, అరుణా సికందర్, బి.రామరాజుకుమార్ , షేక్ సంధానీ, పారెళ్ళ హనుమంతరావు, అంగలకుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లీం కుటుంభాలను పరామార్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి





**ఆర్ సి ఇన్ చార్జ్ యర్రగోండపాలెం పెన్ పవర్ మార్చి 21**

పట్టణంలోని ఇరువురు ముస్లీం సోదరులు అనారోగ్యకారణంగా వైద్యసేవలు పొందుతున్నారని తెలిసి, శుక్రవారం వైసిపి రాష్ట్ర అధికారప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పరామార్శించారు. పట్టణంలోని వైసిపి నాయకులు షేక్ మస్తాన్ అనారోగ్యానికి గురై, నంద్యాలలో వైద్యసేవలు పొంది కొలుకుంటున్నా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తాటిపర్తిచంద్రశేఖర్ వారి నివాసానికి వెళ్ళి ఆరోగ్య బాగోగులు అడిగి తెలుసుకున్నారు.అలాగే వస్తాద్ వీధిలో నివాసముంటున్నా షేక్ రసూల్ ఆరోగ్యపరిస్దితి సరిగా లేక గుంటూరులో వైద్య సేవలు పొందారని తెలిసి ఆయన గృహానికి చేరుకుని పరామార్శించారు.త్వరగా కోలుకోవాలని అభిలషించారు. అనంతరం ఇందిరమ్మ కాలనిలో నూతనంగా నిర్మించిన గౌసు మసీదును సందర్శించి ప్రత్యేక ప్రార్దనలు చేసారు.ముస్లీం సోదరుల మసిదు నిర్మాణం చేసిన తీరును అభినందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ,ముస్లీం మత పెద్దలు పాల్గోన్నారు.


# సమస్త జీవరాశికి జీవనాడి....."అడవులు"

*అడవుల నరికివేతతో భవితకు ప్రమాదం. వన సంరక్షణే జన రక్షణ.*

*అడవుల సంరక్షణ అందరి బాధ్యత.*

*జన విజ్ఞానవేదిక రాష్ట్ర నాయకులు.. పి స్వరూప రెడ్డి*



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 21**

భౌగోళిక విస్తీర్ణంలో 33 శాతం అడవులు వుండాలని అప్పుడే పర్యావరణం సమతుల్యంగా వుంటుందని శాస్త్రవేత్తలు చెబుతుంటే, 20శాతం పచ్చదనం కూడా నేడు కనిపించడంలేదు. . ఒకప్పుడు దట్టంగా అడవులు వుండేవి. నేడు వున్నవికూడా అగ్నికి అహుతవుతున్నాయని కాకుండా స్మగ్లర్ల చే నరికివేయబడుతున్నాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి. స్వరూపరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జనవిజ్ఞాన వేదికలో జరిగిన కార్యక్రమంలో స్వరూపరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఉపాధి పథకం కింది లక్షలాది రూపాయలతో అటవీ శాఖాధికారులు మొక్కల పెంపకం చేపట్టారు. కోట్లాదిరూపాయల ప్రభుత్వ ధనం వృథా అవుతున్నా అడవులు కాపాడటానికి పటిష్ట చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటం, గ్రామీణులలో అడవుల పట్ల తగిన చైతన్యం లేకపోవడం కూడా అడవులు తరిగిపోవడానికి కారణమవుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 21 న నిర్వహించబడుతుందని. 2012, నవంబరు 28న యునెస్కో వారిచే తీర్మానించబడిన ప్రపంచ అటవీ దినోత్సవం, 2013 మార్చి 21న తొలిసారిగా నిర్వహించబడిందన్నారు. ప్రస్తుత, ముందు తరాల వారికి అడవుల ప్రాముఖ్యత, ప్రయోజనాలను తెలియజేయడంకోసం ఈ దినోత్సవం రోజున వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. భూమిపై అడవులే లేకపోతే... సకల జీవరాశి ఉండేదే కాదని. అడవుల నుంచి ఆక్సిజన్ ద్వారానే మనం బతుకుతున్నాం. మనం వాడే వస్తువుల్లో 95 శాతం అడవుల నుంచి వచ్చేవేనని. సబ్బులు, షాంపూలు, మందులు, ఆహార పదార్థాలు అన్నింటికీ మూలం అడవులే నన్నారు. మనమే కాదు... జంతువులు, పక్షులు, క్షీరదాలు, క్రిమికీటకాలన్నీ అడవులపైనే ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. గ్రామాలు, తండాల్లో పేదరికాన్ని తగ్గించడంలో అడవులు కీలక పాత్రపోషిస్తున్నాయని పేర్కొన్నారు.అడవులుంటేనే జీవ వైవిధ్యం కాపాడబడుతుందనన్నారు.తద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందని.కాబట్టి అడవుల రక్షణ అనేది అందరి బాధ్యత యని స్వరూపరెడ్డి పేర్కొన్నారు. అటవీశాఖ అడవులు నరికివేతకు గురికాకుండా ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు.

## ప్రభుత్వ పథకాలపై భాజపా నేత మహేష్ సమాచార సేకరణ





**రిపోర్టర్ పొదిలి, పెన్ పవర్ మార్చి 21**

కూటమి ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న కార్యక్రమాల పై,పేద మహిళల స్వయం ఉపాధి అవకాశాల కోసం చేపడుతున్న వివిధ టైలరింగ్ ఇతరత్రా శిక్షణా కార్యక్రమాల పై పొదిలి భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు యుద్ధం మహేష్ శుక్రవారం పొదిలి మండల అభివృద్ధి అధికారి, పొదిలి నగర పంచాయితీ కమిషనర్ పి. శ్రీనివాసరావు లను కలిశారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణా కార్యక్రమాల నిమిత్తం లబ్దిదారుల ఎంపిక వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక వర్గాల సమతౌల్యం పాటిస్తూ... (ఎన్డీఏ కూటమి విజయానికి కృషి చేసిన కార్యకర్తలను కూడా గుర్తించుకొని) లబ్దిదారుల ఎంపికలో సామాజిక న్యాయం పాటించి తగు న్యాయం చేయాలని ఆయన కోరారు.

## శక్తి యాప్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

*ఎస్ ఐ నరసింహారావు.*

*మహిళల భద్రతకు మెరుగైన పరికరం శక్తి యాప్.*






**పెన్ పవర్ ,కంభం మార్చి 21:**

కంభం పట్టణంలోని వాసవి స్కూల్ నందు శుక్రవారం శక్తి టీం మరియు ఎస్ఐ. నరసింహారావు ఆధ్వర్యంలో శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తి యాప్ వినియోగం అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలని ఉద్దేశంతో అవగాహన కల్పించారు. మహిళల భద్రతను మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ఈ యాప్ అత్యవసర పరిస్థితుల్లో కేవలం ఒక క్లిక్ పోలీసులకు సమాచారం చేరేలా రూపొందించబడినదని వివరించారు. మహిళలు తమకు సంబంధించిన సమస్యలను భయపడకుండా సంకోచం లేకుండా పోలీసులకు తెలియజేయాలని భద్రత వివరాలు శక్తి ఆప్ ద్వారా ఎలాంటి సమస్యలు రాకుండా తక్షణ సాయం వెంటనే పొందండి అని ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి యాప్ అవగాహన బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ అటవీ దినోత్సవం- అడవులు - ఆహారం

**కనిగిరి ఆర్సీఇంచార్జి పెన్ పవర్ మార్చి 21**




అడవులు ఆహార భద్రతకు చాలా ముఖ్యమని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవంను పురస్కరించుకొని శుక్రవారం సమగ్ర శిక్ష, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు "అడవులు - ఆహారము" అనే అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అడవులు పండ్లు,గింజలు,వేర్లు,అడవి మాంసం, శిలీంధ్రాలు, కీటకాలు మరియు ఇతర తినదగిన మొక్కలను అందిస్తాయని ఇవి ఆహార భద్రతకు మరియు పోషకాలను అందించడానికి సహాయపడతాయని అన్నారు.అడవులు ప్రజల జీవనోపాధికి సహాయపడతాయని అడవులు ఆహారం, ఇంధనం, మందులు మరియు ఇతర వనరులను అందిస్తాయని అన్నారు.పి సి పల్లి మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవి మాట్లాడుతూ అడవులు గాలిని శుభ్రం చేయటం, నీటి చక్రాలను నియంత్రించటం మరియు వాతావరణ మార్పుల నుండి రక్షించటం ద్వారా పర్యావరణ సేవల ద్వారా ఆహార భద్రతకు సహాయపడతాయని తెలిపారు.అడవులను రక్షించడం ద్వారా, మనం ఆహార భద్రతను మరియు పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చునని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటలని, అడవులను సంరక్షించుకోవాలని అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన సదస్సు

**వలేటివారిపాలెం పెన్ పవర్ మార్చి 21**

భారతీయ రిజర్వ్ బ్యాంక్ మరియు అవార్డు స్వచ్ఛంద సేవ సంస్థ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం శుక్రవారం స్థానిక మండలంలో వెలుగు కార్యాలయంలో జరిగింది . డిఈఏఎఫ్ ఆర్థిక సహాయంతో బ్యాంకు సేవలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ కె . నరేంద్ర దేవ్ ఎంఇఓ ఏ మల్లికార్జున , ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ సూర్య ప్రకాష్ అవార్డు సంస్థ అడ్మిన్ రాజేశ్వరి సంస్థ వైస్ ప్రెసిడెంట్ బాజీ పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఎంపీడీఓ మాట్లాడుతూ ఖాతాదారులందరూ తప్పకుండా నామినేషన్ చేయించుకోవాలని కోరారు. మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న రిజర్వ్ బ్యాంకు మరియు అవార్డు సంస్థకు ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థులు చిన్నతనం నుండి ఆర్థిక క్రమశిక్షణ నేర్చుకోవాలని చిన్నతనం నుండి పొదుపు చేయటం అలవాటు చేసుకోవాలని కోరారు. రిజర్వ్ బ్యాంక్ గురించి తల్లిదండ్రులకు స్నేహితులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఏపీజీబీ మేనేజర్ మాట్లాడుతూ రుణం తీసుకున్న వాళ్లు సక్రమంగా చెల్లించి సివిల్ స్కోర్ పెంచుకోవాలని ఖాతాదారులందరూ సామాజిక భద్రతా పథకాలలో చేరాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధి సేవలు మరియు నగదు రహిత లావాదేవీల గురించి కళాకారులు నాటికలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అవార్డు సంస్థ ప్రతినిధులు శ్రీనివాసులు , పి పి టి ద్వారా సైబర్ మోసాల గురించి వివరించారు. వెలుగు సిసిలు, పొదుపు గ్రూపు మహిళలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ,రైతులు విద్యార్థులు పాల్గొన్నారు.



# కష్టాల కడలిలో కొట్టుమిట్టాడు తున్న కాశయ్య కుటుంబానికి సహాయం అందించిన దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్

**ఇబ్బందులు పడుతున్న కొమరోలు మండలం కంకర వానిపల్లి గ్రామానికి చెందిన కాశయ్య సుజాతల కుటుంబం.**

**పెన్ పవర్ వార్త కథనానికి స్పందించిన శరత్ బాబు.**

**కుటుంబ దీనస్థితిని తెలుసుకొని పదివేల రూపాయలు విలువ చేసే నిత్యవసర వస్తువులను అందించిన దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు లొక్కు శరత్ బాబు.**

**శరత్ బాబుకు ధన్యవాదాలు తెలిపిన కాశయ్య, సుజాత.**

**కొమరోలు పెన్ పవర్ మార్చ్ 21**

కొమరోలు మండలం కంకరవాని పల్లి గ్రామానికి చెందిన మట్టి మల్ల కాశయ్య, సుజాతల కుటుంబ ఆర్థిక పరిస్థితులను తెలుసుకొని దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ తమ వంతు సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నది. కంకరవాని పల్లి గ్రామానికి చెందిన సుజాతకు నరాల వ్యాధి సోకటంతో గత రెండు మాసాలుగా మంచానికి పరిమితమై జీవిస్తున్నది .కాగా ఆమె భర్త కాశయ్య హైదరాబాదులో తాపీ మేస్త్రి గా పనిచేసేవాడు. ప్రమాదవశాత్తు భవనం పైనుంచి జారిపడంతో అతని కాళ్లు విరిగాయి. దీనితో వైద్యులు కాళ్లలో రాడ్లు బిగించి శస్త్ర చికిత్స చేశారు .అప్పటినుంచి కాశయ్య కూడా నడవలేక ఇంటికి పరిమితమై జీవిస్తున్నాడు. దీనితో ఆ దంపతులు ఇద్దరు కుమారుల చదువులకు, కుటుంబ పోషణకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తటంతో తమ కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని కాశయ్య సుజాత విజ్ఞప్తి చేస్తూ ఆపన్న హస్తాల కోసం ఎదురుచూడ సాగారు. ఆ దంపతుల ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ ఆర్థిక పరిస్థితులను వివరిస్తూ పెన్ పవర్ దినపత్రికల్లో వచ్చిన వార్త కథనానికి స్పందించిన దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు లొక్కు శరత్ బాబు గత వారం కంకరవానిపల్లి గ్రామానికి వెళ్లి సుజాత కాశయ్యలను పరామర్శించి ధైర్యం చెప్పి వచ్చారు. కాగా శుక్రవారం



మరోమారు ఆ గ్రామానికి 10 వేల రూపాయల విలువ చేసే నిత్యవసర వస్తువులతో వెళ్లి కాశయ్య కుటుంబానికి అందజేశారు. దీనితో కాశయ్య అతని భార్య సుజాత వారి కుటుంబ సభ్యులు దేవుని రూపంలో వచ్చి ఆదుకున్న శరత్ బాబుకు దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజింగ్ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆ కార్యక్రమంలో దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు కారుమంచి పీరయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



# 30 మంది క్విస్ విద్యార్థుల రక్తదానం




**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మార్చి 21**

సామాజిక సేవలో క్విస్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎప్పుడూ ముందే ఉంటారు. ఎన్ ఎస్ ఎస్ విభాగానికి చెందిన 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రసన్న ఫౌండేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆ శిబిరంలో క్విస్ కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. స్వచ్ఛంధంగా రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానం అని విద్యార్థుల్లో ఇలాంటి సామాజిక స్ఫూర్తి ఉండాలని క్విస్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి అన్నారు. విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ శ్రీ గాయత్రి, ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ డీన్ డాక్టర్ నవనీద కృష్ణ, ఎన్ ఎస్ ఎస్ ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ పి. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కు నివాళి

**బిజెపి నాయకులు అప్పిశెట్టి**



గిద్దలూరు పెన్ పవర్ మార్చి 21

గిద్దలూరు పట్టణము కు చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కిషోర్ ఆకస్మిక మరణం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ నాయకులు అపి శెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యం లో రజక వీధి లో వారి నివాసానికి వెళ్లి కిషోర్ భౌతికకాయాన్ని సందర్శించి పుష్పగుచ్ఛం ఉంచి ఘన నివాళి అర్పించారు. ఈ కార్య క్రమం లో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు, గిద్దలూరు పట్టణ బీజేపీ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వర రావు పాల్గొని వారి కుటుంభాని పరామర్శించారు..

# ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి ఇంగ్లీష్ పేపర్ పరీక్ష

**443మంది విద్యార్థులు పరీక్షకు హాజరు.**

**ఇద్దరు విద్యార్థులు పరీక్షకు గైరహాజరు.**

**కొమరోలు ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం.**



**కొమరోలు పెన్ పవర్ మార్చి 21**

కొమరోలు లో ఏర్పాటుచేసిన మూడు పదవ తరగతి పరీక్షా కేంద్రాలలో శుక్రవారం నిర్వహించిన ఇంగ్లీష్ పేపర్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని కొమరోలు ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం తెలిపారు. కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి ఇంగ్లీష్ పేపర్ పరీక్ష రాసేందుకు 175 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, వారిలో ఒకరు గైర్హాజరయ్యారని, మిగిలిన 174 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారన్నారు. సర్వైట్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి కేటాయించిన మొత్తం170 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, ఇక నరేష్ రెడ్డి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి 100మంది విద్యార్థులు కేటాయించగా వారిలో ఒక విద్యార్థి గైర్హాజరై మిగిలిన 99 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని అన్నారు .ఇప్పటివరకు జరిగిన తెలుగు, హిందీ ,ఇంగ్లీష్ లాంగ్వేజ్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని, ఎస్సై నాగరాజు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పరీక్ష కేంద్రాల వెలుపల సందే వాతావరణం కనిపిస్తున్నదని ఎంఈఓ2 వెంకటరత్నం తెలిపారు.

# తీవ్రమైన ఎండ, వడగాడుపులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

*తీవ్రమైన ఎండ, వడగాడుపులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.*

*ఎక్కువగా నీరు నీటి శాతం ఎక్కువగా ఉన్న పండ్లను తీసుకోవాలి.*

*శరీరం డిహైడ్రేషన్ కాకుండా తమ జాగ్రత్త తీసుకోవాలి.*

*బయటకు వెళ్లి వారు గొడుగు తో వెళ్లాలి తెల్లని నూలు వస్త్రాలు ధరించడం శ్రేయస్కరం.*

*శీతల పానీయాలు, ఐస్ ముక్కలకు దూరంగా ఉండాలి.*

*వడదెబ్బ తగలకుండా ఆసమైన జాగ్రత్తలు పాటించాలి.*

**కొమరోలు పెన్ పవర్ మార్చి 21**

రోజురోజుకు తీవ్రతరమవుతున్న ఎండ, వీస్తున్న వడ గాడ్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమరోలు ప్రభుత్వ వైద్యాధికారి చైతన్య దీపక్ కోరారు. ఈ ఏడాది ఫిబ్రవరి మాసం నుంచే ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, ఇక రాబోవు రోజులలో కూడా మరింత తీవ్రతరమైన ఎండలు కాసే అవకాశాలు ఉన్నాయన్నారు. వడగాడుపులు కూడా అధికంగా వీచే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రజలు ఎక్కువగా తాగునీరు తీసుకోవాలని, వాటితో పాటు నీటి శాతం అధికంగా ఉన్న పండ్లను తీసుకోవడం ఆరోగ్య రీత్యా మంచిదని సూచించారు. శరీరం డిహైడ్రేషన్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని. బయటికి వెళ్లేవారు గొడుగు తీసుకొని వెళ్లాలని తనకు తెల్లని టోపీ ధరించాలని ,తెల్లని పలుచని నూలు వస్త్రాలు ధరించడం శ్రేయస్కరమని అన్నారు. వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్త తీసుకోవాలని ,ఎవరికైనా వడద దెబ్బ సోకితే వెంటనే ఆ రోగిని నీడగల ప్రదేశానికి చేర్చాలని ,చల్లని నీటిలో ముంచిన తడి వస్త్రంతో శరీరం పూర్తిగా తుడవాలని, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయి వచ్చేవరకు అలాగే చేస్తూ ఉండాలని, చల్లని గాలి తగిలేలా ఏర్పాటు చేయాలని సూచించారు. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజు ద్రావణం లేదా ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణాన్ని తాగించాలని ఆయన సూచించారు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదన్నారు. వీలైనంత త్వరలో రోగిని సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని ఆయన కోరారు. సాధ్యమైనంతవరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల మధ్యకాలంలో ఆరు బయట అధిక శారీరక



శ్రమతో కూడిన పనులు చేయకుండా ఉండటం మంచిదన్నారు .శీతల పానీయాలు, మంచు ముక్కలు తీసుకోకూడదని వాటితో గొంతుకు సంబంధించిన అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. వేసవికాలం ముగిసేంతవరకు బయటికి వెళ్లేవారు మంచినీళ్లు తాగి వెళ్లాలని ,అంతేగాక ఎక్కువసార్లు మంచినీళ్లు తాగుతూ ఉండాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూత్రాన్ని అందరూ పాటించాలని డాక్టర్ చైతన్య దీపక్ తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణి



**పొన్నలూరు,పెన్ పవర్ మార్చి 21**

మండలంలోని పెద వెంకన్నపాలెం గ్రామానికి చెందిన తుమాటి శ్రీలతకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేశారు. శ్రీలత హైదరాబాద్ ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో డెలివరీ నిమిత్తం అయిన ఖర్చులు ఒక లక్ష 30 వేల రూపాయలు దానికి సంబంధించి రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయగా శుక్రవారం నాయుడుపాలెంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి నివాసం వద్ద 64 వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ ను శ్రీలత మామ గారికి అందజేశారు, శ్రీలత మామగారు మాట్లాడుతూ మా ఇబ్బందులు తెలిసి మాకు సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు మంత్రి బాల వీరాంజనేయ స్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎంపీపీ అధ్యక్ష పదవికి ఎన్నిక

**త్రిపురాంతకం పెన్ పవర్ మార్చి 21**

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్ విజయవాడ వారి నోటిఫికేషన్ ను అనుసరించి త్రిపురాంతకం మండలం అధ్యక్షుని పదవికి ఎన్నిక పరోక్ష పద్ధతి ద్వారా నిర్వహించు నిమిత్తము ప్రత్యేక సమావేశము నిర్వహించి తదనంతరం నూతన అధ్యక్షుని ఎన్నుకొనుటకు తేది:-27.03.2025 న మండల పరిషత్ కార్యాలయం, త్రిపురాంతకం నందు ప్రత్యేక సమావేశము ఏర్పాటు చేయడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# దాసరి ప్రసన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం

**శిబిరాన్ని ప్రారంభించిన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ. వి సుబ్బారావు**







**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మార్చి 21**

దాసరి ప్రసన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాసరి కనకయ్య నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం రెడ్ క్రాస్ భవనంలో దాసరి ప్రసన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ. వి సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐ.వి సుబ్బారావు మాట్లాడుతూ దాసరి ప్రసన్న 12వ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయటం 50 మంది పైగా బ్లడ్ డొనేషన్ చేయటం అభినందనీయం అన్నారు. ప్రతి సంవత్సరం కనకయ్య ఆధ్వర్యంలో రథధాన శిబిరాన్ని ఏర్పాటుచేసి ఎంతోమందికి ప్రాణదానం చేయటం అభినందనీయమని పేర్కొన్నారు. జర్నలిస్టులు కూడ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఎవరైనా రక్తం అందుకున్న మరణించకూడదని సంకల్పంతోటి ఆమె మరణించి 12 సంవత్సరాలు అయినా ప్రతి ఏడాది ఆమె వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి ఎంతోమందికి ప్రాణదానాన్ని కల్పిస్తున్న దాసరి ప్రసన్న ఫౌండేషన్ను అభినందించారు. ట్రాఫిక్ సిఐ పాండురంగర మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలై ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యం పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ప్రసన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. బ్రేక్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ కిరణ్ మాట్లాడుతూ దాసరి కనకయ్య పాప మృతి చెంది 12 సంవత్సరాల అయినా నేటికీ ఆమెను గుర్తుంచుకొని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు.ఈ శిబిరంలో సుమారు 50 మందికి పైగా రక్తదాన చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు శాంతారావు అధ్యక్షత వహించగా రెడ్ క్రాస్ సెక్రటరీ శ్రీమన్నారాయణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి దాసరి కనకయ్య, చీమకుర్తి జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు,ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు ఏ.సురేష్ పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా

కోట్లాది రూపాయిల సీఎంఆర్ఎఫ్ నిధులతో పేద ప్రాణాలకు అండ

నియోజకవర్గ స్థాయిలో సాధికార సారథుల సేవలు భేష్ - క్షేత స్థాయి పర్యటనలతోనే టీడీపీ బలోపేతం

*80 మందికి సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత - ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్*









**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 21**

ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇచ్చిందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు లో మంత్రి గొట్టిపాటి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ప్రజావేదిక నిర్వహించారు. ముందుగా 80 మంది లబ్ధిదారులకు రూ.39 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వీటితో పాటు రూ.9 లక్షల విలువైన ఎల్వోసీలను ఇద్దరికి అందజేశారు. అనంతరం ప్రజా వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ... అనారోగ్య సమస్యల వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులు తల్లకిందులవుతాయని, ఆస్పత్రుల ఖర్చులతో కొన్ని కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతాయిని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బడుగు, బలహీన, అల్పాదాయ వర్గాల ఆరోగ్య రక్షణకు చర్యలు చేపట్టామని వివరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వందలాది మందికి ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోనే ఇప్పటి వరకు 439 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధి చేకూరిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.

**సాధికార సారథులతో పార్టీ మరింత బలోపేతం**

తెలుగుదేశం పార్టీని బలోపేతం దిశగా సాధికార సారథులు మరింత కృషి చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలో సాధికార సారథులు పార్టీ గెలుపుకు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ అవసరమో వారికి తెలుసని చెప్పారు. పథకాలు అందని వారికి, సీఎంఆర్ఎఫ్ అవసరమైన వారిని సాధికార సారథులే గుర్తించి వారికి లబ్ధి చేకూర్చాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న మొత్తం 4,500 మంది సాధికార సారథులను పార్టీ సభ్యులు కూడా సమన్వయం చేసుకుని గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. నెలలో ఒక రోజు అందరూ కలిసి సమావేశం అయ్యి అన్ని విషయాలూ చర్చించాలని చెప్పారు. అదే విధంగా సాధికార సారథులను ఎవరూ తక్కువ చేయకూడదని, గత ఎన్నికల్లో వారంతా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించారని గుర్తు చేశారు. ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తే తెలుగు దేశం పార్టీకి ఎదురు ఉండదని తెలిపారు.

## కాపులకు స్వయం ఉపాధి పథకం లబ్ధిదారులకు వయోపరిమితి పెంచాలి.



**పొన్నలూరు పెన్ పవర్ మార్చి 21**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వయం ఉపాధి పథకం లబ్ధిదారులకు అన్ని కులాల వారికి 21 నుంచి 60 సంవత్సరాలు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపిందన్నారు, అయితే తెలగ, బలిజ, కాపు, ఒంటరి కులస్తులకు 21 నుంచి 50 సంవత్సరాలు వరకు వయసు మాత్రమే పరిమితి చేయటం ఎంతవరకు సబబు అని ఇతర కులాల వారికి ఇచ్చినట్లే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వయోపరిమితి 21 నుంచి 60 సంవత్సరాలు వరకు పెంచవలెనని నియోజకవర్గ జేఏసీ నాయకుడు తాటి యల్లమంద ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు.

## సూరవారిపల్లె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో మస్తాన్ వలి

**సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చిన ఎంపీడీవో.**

**విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని ఆదేశం**



**కొమరోలు పెన్ పవర్ మార్చి 21**

కొమరోలు మండలం సూరి వారి పల్లి లో గల గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు .ఆ సందర్భంగా సిబ్బందికి విధుల నిర్వహణ పట్ల సలహాలు ఇచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రకాల సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ,గ్రామంలో పారిశుద్ధ పనులను సమర్థవంతంగా నిర్వహింపచేస్తూ పర్యవేక్షణ చేయాలని, డంపింగ్ యార్డ్స్ నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ, తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని ఆయన సచివాలయ ఉద్యోగులకు సూచనలు సలహాలు ఇచ్చారు.

## ప్లాంట్ నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర





**పీసీపల్లి పెన్ పవర్ మార్చి 21**

మండలంలోని దివాకరపురం సమీపంలో రిలయన్స్ బయో గ్యాస్ భూమిపూజ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కనిగిరి ప్రాంత అభివృద్ధికి ఇదొక మైలు రాయని, నియోజకవర్గంలో ని వేలాదిమంది ప్రజలకు, యువతకు ఉపాధి లభిస్తుందని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ , పంచాయతీ రాజ్ డిఇ శ్రీధర్ రెడ్డి , ఎలక్ట్రికల్ ఏఇ రాజేష్ , ఇన్చార్జ్ తహశీల్దార్ ధర్మ తేజ , రిలయన్స్ ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ సతీమణి మృతి బాధాకరం

***మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి***

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు,పెన్ పవర్ మార్చి 21**

మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సతీమణి షైనాబ్ మృతి పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంతాపం తెలిపారు. షైనాబ్ మరణ వార్త తెలుసుకున్న మంత్రి డోలా వెంటనే మంత్రి ఫరూక్ ను ఫోన్లో పరామర్శించారు. ఆమె మృతి వారి కుటుంబానికి తీరని లోటన్నారు. షైనాబ్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ అల్లా వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం ప్రసాదించాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి ప్రార్థించారు.

## పవిత్ర మాసంలో ఉపవాస దీక్షలు పుణ్యఫలం.. ఎమ్మెల్యేతాటిపర్తి








**ఆర్ సి ఇన్ చార్జ్ యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 21**

రంజాన్ మాసం ముస్లీం సోదరులకు ఎంతో భక్తిపూర్వకమైన పవిత్ర మయిన పండుగని,ముసల్మాన్ సబ్ భాయోకో అల్లా ఆశీస్సులతో రంజాన్ ఫలాలు అందాలని వైయస్సాఆర్ సిపి రాష్ట్ర అధికారప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు.రంజాన్ ఉపవాసదీక్షల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ముస్లీం సోదరులందరికి షాధీఖానాలో ఇఫ్తార్ విందును ఏర్పాటుచేసారు.ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక దువా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతు నాకు ఇష్టమైన పండుగ రంజాన్ అని,తనకు చిన్ననాటి నుండి ముస్లీం సోదరులే తోడునీడగా ఉంటారని అన్నారు. పవిత్ర గ్రంధమైన ఖురాన్ అవతరించిన నెల ముస్లీం సోదరుల జీవితాలలో అత్యంతంగా ప్రభావం చూపుతుందని అన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష చేయడంతో పాటు,జకాత్ ,సదకా,ఫిత్రా,లాంటి నియమ సిద్దాంతాలతొ పేదవాని ఆకలి తీర్చే ప్రయత్నం మానవత విలువలకు నిలువుటద్దమని అన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గ ముస్లిం సోదరులు నన్ను ఎంతగానో ఆదరించి అక్కున చేర్చుకున్నారని వారి అభిమానం వెలకట్టలేదని అన్నారు. జగనన్న ప్రభుత్వంలో ముస్లీంలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు.ఈ కార్యక్రమంలో అయిదు మండాలాల నాయకులు కార్యకర్తలు ముస్లీం సోదరులు భారిగా పాల్గొన్నారు.

# శ్రీశైలం ఘాట్ రోడ్లో టిప్పర్ బ్రేక్ డౌన్

రెండు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్

ఎస్సై వి. మహేష్ చొరవతో ట్రాఫిక్ క్లియర్






**పెద్దదోర్నాల పెన్ పవర్ మార్చి 21**

మండలంలోని తుమ్మల బయలు చెంచుగూడెం నుండి గురువారం ఉదయం 8:30 గంటల సమయంలో శ్రీశైలం ఘాట్ రోడ్లో ఓ టిప్పర్ బ్రేక్డౌన్ కావడంతో ప్రధాన రహదారి మూసుకుపోయింది. దీంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దాదాపు 8:30 గంటల నుంచి 3:20 గంటల వరకు ట్రాఫిక్ నిలిచి ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సమాచార తెలుసుకున్న ఎస్సై వి. మహేష్ తక్షణమే స్పందించారు. సమస్యను పరిశీలించి టిప్పర్లో డీజిల్ అయిపోయిందని గుర్తించారు. వెంటనే తన స్వంత నిధులతో 40 లీటర్ల డీజిల్ తెప్పించి టిప్పర్ను స్టార్ట్ చేయించారు. అనంతరం ట్రాఫిక్ను సక్రమంగా నిర్వహించి, వాహనాలను ముందుకు సాగేలా చేశారు. మూడు గంటలకు పైగా నిలిచిన ట్రాఫిక్ను క్లియర్ చేయడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ఎస్సై మహేష్ సత్వర చర్యలు తీసుకుని, స్వయంగా నడుం కట్టుకుని సమస్యను పరిష్కరించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అతని సేవా భావాన్ని స్థానికులు, ప్రయాణికులు ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## కారుణ్య నియామక పత్రం అందజేసిన జిల్లా ఎస్పీ




**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 21**

చీరాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తూ కోవిడ్ తో మరణించిన హెడ్ కానిస్టేబుల్ జెఎస్ఎస్ రత్నకుమార్ రావు కుమారుడు యశ్వంత్ కి కారుణ్య నియామకం క్రింద బాపట్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం కల్పిస్తూ నియామకపత్రాన్ని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మరణించిన హెడ్ కానిస్టేబుల్ యొక్క కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ గా సుదీర్ఘ కాలంగా అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ కోవిడ్ సమయంలో కోవిడ్ తో మరణించడం బాధాకరమని, వారికి ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చునని, పోలీసు శాఖ వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. యశ్వంత్ తో మాట్లాడుతూ విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, వృత్తి నైపుణ్యం పెంచుకొని అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలని, ఉద్యోగంతో ఉజ్వల భవిష్యత్కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఏఓ రామ్మోహన్ రావు, డీపీఓ సిబ్బంది రవికిరణ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పిట్టకాయగుల్ల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన తాహసిల్దార్ జితేంద్ర కుమార్

**బేస్తవారిపేట, పెన్ పవర్ మార్చి21:**

బేస్తవారిపేట మండలంలోని సమస్యాత్మక పరీక్షా కేంద్రమైన పిట్టకాయగుల్ల పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని బెస్తవారిపేట తాహసిల్దార్ జితేంద్ర కుమార్ శుక్రవారం పరిశీలించారు. పదవ తరగతి పరీక్షా కేంద్రంలో శుక్రవారం నాడు ఇంగ్లీషు పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రంలో ఎలాంటి మాస్ కాఫీంగ్ జరగకుండా ఉండేందుకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షా కేంద్రంలో గలిజేరు గుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పిట్టకాయ గుళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 139 మంది విద్యార్థులకు గాను 138 మంది హాజరయ్యారు. ఇంగ్లీష్ పరీక్షను విద్యార్థిని విద్యార్థులు ప్రశాంతంగా జరిగినట్లు జీతేంద్రకుమార్ తెలిపారు.



# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటుచేసిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం భీమా నాయక్, సబ్ ఇన్స్పెక్టర్ టి కిషోర్







**పామూరు పోలీస్ పామూరు,పెన్ పవర్,మార్చి21.**

పట్టణంలోని ఇరువురు రోడ్ లోని మర్కస్ మసీదు లో పవిత్ర రంజాన్ మాసం శుక్రవారం సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలిపిన పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం భీమా నాయక్, సబ్ ఇన్స్పెక్టర్ టి కిషోర్ బాబు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక దువా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతు పవిత్ర గ్రంధమైన ఖురాన్ అవతరించిన నెల ముస్లీం సోదరుల జీవితాలలో అత్యంతంగా ప్రభావం చూపుతుందని అన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష చేయడంతొ పాటు,జకాత్ ,సదకా, ఫిత్రా, లాంటి నియమ సిద్దాంతాలతొ పేదవాని ఆకలి తీర్చే ప్రయత్నం మానవత విలువలకు నిలువుటద్దమని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటనారాయణ, సిద్దయ్య ధారబోయిన రమణయ్య, పోలీస్ సిబ్బంది, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## బేస్తవారిపేటఎంపీడీవో కార్యాలయానికి చేసిన జెడ్పి సీఈఓ చిరంజీవి



**బేస్తవారిపేట, పెన్ పవర్ మార్చ్ 21**

బెస్తవారిపేట ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రకాశం జిల్లా జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది హాజరు పట్టిని, పలు రికార్డులను తనిఖీ చేశారు. బెస్తవారిపేట మండలం లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి బెస్తవారిపేట ఎంపీడీవో ఏవి రంగనాయకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మండలంలో జి ఎస్ డబ్ల్యూ ఎస్ కార్యక్రమాల గురించి వివరంగా తెలుసుకున్నారు. మండల అభివృద్ధి కి అధికారులు సిబ్బంది ప్రతి ఒక్కరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెడ్పి సీఈఓ చిరంజీవి సూచించారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రంగనాయకులు, ఈఓఆర్డి షేక్ జిలాని ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బేస్తవారిపేటఎంపిడిఓ కార్యాలయానికి చేసిన జెడ్పి సీఈఓ చిరంజీవి



**బేస్తవారిపేట, పెన్ పవర్ మార్చి 21:**

బెస్తవారిపేట ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రకాశం జిల్లా జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది హాజరు పట్టిని, పలు రికార్డులను తనిఖీ చేశారు. బెస్తవారిపేట మండలం లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి బెస్తవారిపేట ఎంపీడీవో ఏవి రంగనాయకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మండలంలో జి ఎస్ డబ్ల్యూ ఎస్ కార్యక్రమాల గురించి వివరంగా తెలుసుకున్నారు. మండల అభివృద్ధి కి అధికారులు సిబ్బంది ప్రతి ఒక్కరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెడ్పి సీఈఓ చిరంజీవి సూచించారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రంగనాయకులు, ఈఓఆర్డి షేక్ జిలాని ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎర్త్ అవర్ పాటిద్దాం

### భవిష్యత్తు తరాలకు మెరుగైన ప్రపంచాన్ని సృష్టిద్దాం



**కనిగిరి ఆర్సీఇంచార్జి పెన్ పవర్ మార్చి 21**

నేడు (శనివారం )ఎర్త్ అవర్ పాటించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ రాష్ట్ర ప్రజలకు పిలుపు మేరకు శుక్రవారం కనిగిరి మున్సిపాలిటీ ఆవరణలో పురపాలక శాఖ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎర్త్ అవర్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియేలు జోసఫ్ మాడ్లడుతూ ఎర్త్ అవర్ గ్లోబల్ ఉద్యమంలో భాగంగా మార్చి 22 శనివారం రాత్రి 8.30 నుండి రాత్రి 9.30 గంటల వరకు అన్ని అనవసరమైన లైట్లను ఆపివేయడం ద్వారా 'ఎర్త్ అవర్'ను పాటించాలని కోరారు. ఒక గంట పాటు అనవసరమైన లైట్లను స్వచ్ఛందగా ఆపివేయడం ద్వారా ఎర్త్ అవర్ ప్రచారం ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఏకం చేస్తుందని, పరిరక్షణ మరియు స్థిరమైన పద్ధతులను దృష్టికి తీసుకురావడానికి, భవిష్యత్తు తరాలకు మెరుగైన ప్రపంచాన్ని సృష్టించడానికి సహాయపడుతుందని అందుకే ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో పాల్గొని ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ ప్రసాద్, శానిటేరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణలో జరిగిన అన్యాయంపై, విచారించి న్యాయం చేయాలని, అధికారులను వేడుకుంటున్న దళిత కుటుంబం



**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 21:**

మండలంలోని చేవూరు గ్రామంలో పరిశ్రమల కోసం భూసేకరణ జరుగుతున్న విషయం తెలిసిందే. కానీ ఈ భూసేకరణలో అధికారుల యొక్క చేతివాటం వల్ల, చేవూరు దళిత కాలనీకి చెందిన అక్కిల గుంటచిన్నయ్య (50)కు వారసత్వంగా వచ్చిన భూమి మరియు కొనుగోలు ద్వారా వచ్చిన భూమితో కలిపి 60 సెంట్లు ఉందని, సర్వే నెంబరు 569,548,554,584, 889లలో, ఈ భూమి ఉందని భూసేకరణ ప్రారంభం నుండి, మాకు, 1బీ, అడంగల్, రిజిస్ట్రేషన్, ఉన్నాయని, మా భూమికి నష్టపరిహారం చెల్లించమని కాళ్లు అరిగిపోయేలా, తిరిగామని, అక్కిలగుంట చిన్నయ్య, మరియమ్మ, వారి కుమారుడు డేనియల్ సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ కు తెలియజేశారు. వీఆర్వో దగ్గర నుంచి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకు, ఈ భూమికి, మీకే నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారని, కానీ తీరా డబ్బులు వేసే సమయానికి, అఖిల గుంట చిన్నమ్మకు వీలునామా ఉంది అనే పేరు తోటి, 33.1/2సెంట్లుకు, అకౌంట్లో డబ్బులు జమ చేశారని మాది న్యాయం అని అధికారులు చెప్పి, డబ్బులు వేసే సమయానికి డూప్లికేట్ వీలునామా తెచ్చిన వారికి డబ్బు జమా చేయడం ఎంతవరకు న్యాయం అని దళిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ఇందులో అధికారుల చేతివాటం వలనే ఇది జరిగిందని బాధితులు వాపోతున్నారు. ఈ విషయమై గురువారం నాడు, సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజను కలవగా, వీలునామా ప్రకారం, డబ్బులు జమ చేసామని, మీది న్యాయం అనుకుంటే, కోర్టుకు వెళ్ళమని, చెప్పారని, వారు తెలిపారు. మేము నిరుపేదలమని. ఆ భూమిని ఆధారంగా బ్రతికే వారిమని కోర్టుకు వెళ్లే స్తోమత మా దగ్గర లేదని . పై అధికారులు, స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, తిరిగి వారి దగ్గర నుండి మాకు రావాల్సిన డబ్బులు మాకు ఇప్పించి న్యాయం చేయవలసిందిగా సంబంధిత అధికారులను వేడుకుంటున్నామని, లేకుంటే మాకు చావే శరణ్యం అని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు.

# సి ఎస్ పురం కేజీబీవీ లో ప్రవేశాలకు 22 నుంచి దరఖాస్తుల స్వీకరణ - కేజీబీవీ ప్రిన్సిపాల్ షేక్ రేష్మ

**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 21**



చంద్రశేఖరపురం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6,11 తరగతుల్లో ప్రవేశాల కోసం అలాగే 7,8,9,10,12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ షేక్ రేష్మ తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్లైన్ దరఖాస్తులు మార్చి 22 నుండి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయని ఆన్లైన్లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని తెలిపారు అనాధలు, బడి బయట పిల్లలు, బడి మానేసిన పిల్లలు, పేద, ఎస్. సి , ఎస్. టి, బీసి, మైనార్టీ, బిపిఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కొరకు పరిగణించబడతాయని తెలిపారు ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చునని తెలిపారు.

# చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో జరిగిన శిక్షణా కార్యక్రమం





**పామూరు, పెన్ పవర్,మార్చి21**

పట్టణంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో డి ఎల్ పి ఓ హనుమంతరావు అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం జరిగింది... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సేకరించే చెత్తను సంపద కేంద్రాలకు తరలించి తడి చెత్త పొడి చెత్తను వేరు చేయాలని సూచించారు, తడి చెత్త తో ఎరువు తయారీ పొడి వ్యర్థాలలో ప్లాస్టిక్, కాగితాలు ,ఇనుము ఇతరత్రా చెత్త పునర్వినియోగానికి అవకాశం ఉందని అన్నారు. తద్వారా గ్రామస్థాయిలో సంపద సృష్టించవచ్చని తెలిపారు. తడి చెత్త పొడి చెత్త సెగ్రికేషన్ చేసి, నాడ పిట్లను వేసి ఎరువు తయారు చేసి వాటిని తొట్లలో వేసి బాగా నీటి ద్వారా గోనె సంచులు తడిపి వర్మి కంపోస్ట్ తయారు చేయు విధానాన్ని ఈ శిక్షణా కార్యక్రమంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పామూరు గ్రామపంచాయతీ కార్యదర్శి జివి అరవింద రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ జి రత్నకుమార్, పంచాయతీ వార్డు మెంబర్లు పిడుగు శ్రీనివాసులు, షేక్ మస్తాన్, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, స్థానిక సచివాలయ సిబ్బంది, రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మాజీ జెడ్పిటిసి మారబోయిన హుస్సేన్ రావు నివాళులర్పించిన ముస్లిం మైనార్టీ నాయకులు



**పామురు, పెన్ పవర్,మార్చి21.**

మాజీ జడ్పిటిసి టిడిపి సీనియర్ నాయకులు మోరబోయిన హుస్సేన్ రావు యాదవ్ నిన్న మధ్యాహ్న సమయంలో గుండెపోటుతో మృతి చెందాడు. మోరబోయిన హుస్సేన్ రావు యాదవ్ పార్ధిహదేహానికి నివాళులర్పించిన ముస్లిం మైనార్టీ నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోరబోయిన హుస్సేన్ రావు యాదవ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపొందుటకు కీలక పాత్ర పోషించాడు. పార్టీలో ఆయన సేవలో మరువురాణి అని వారు అన్నారు. అనంతరం మోరబోయిన హుస్సేన్ రావు యాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో షేక్ హాజీ గౌస్ , షేక్ గౌస్ బాషా, షేక్ ఖజా రహమతుల్లా , ఖాదర్ బాషా తదితరులు నివాళులర్పించారు.

## నేత్రదాతా అభివందనం

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 21**

ఒంగోలులోని టి ఎస్ ఆర్ టవర్స్, పాత కూరగాయల మార్కెట్ ఎదురుగా, గానుగపాళెం నివాసి తాతా సత్యవతి (77సం) శుక్రవారం మృతిచెందారు.నేత్రదానం ను దృష్టిలో ఉంచుకుని, కుటుంబ సభ్యులు ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారికి సత్యవతి మరణ వార్తను తెలియజేశారు. సంస్థ వారు మరణ వార్తను ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ వారికి తెలియజేయడంతో ఒంగోలు ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ టెక్నీషియన్ ఉపేంద్ర.. సత్యవతి పార్థీవ దేహం వద్దకు చేరుకుని కార్నియాలను సేకరించారు. కుటుంబ సభ్యులకు ధృవపత్రాన్ని అందజేశారు.

## ఎడ్ల పందాలు ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల




**కొనకనమిట్ల పెన్ పవర్ మార్చి 21**

ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన వెలుగొండ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి రోజు గరుడోత్సవం సందర్భంగా వెలుగొండ వేంకటేశ్వర స్వామి వారిని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా మూడు రోజులు పాటు జరగనున్న జాతీయ ఎడ్ల పందాలను కొబ్బరికాయ కొట్టి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాబురావు,ఉత్సవ కమిటీ చైర్మన్ కుందూరు కాశిరెడ్డి,నాయకులు భాషాపతి నాయుడు,భీమంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా వరికుంట్ల దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుక

**- దంపతులను ఆశీర్వదించిన పలువురు నాయకులు అధికారులు ప్రజలు అభిమానులు**



**రిపోర్టర్ పొదిలి, పెన్ పవర్ మార్చి 21**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్, సురేఖ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకను శుక్ర వారం అభిమానుల జనసందోహం మధ్య పొదిలిలో అట్టహాసంగా జరిగినది. వరికుంట్ల అనిల్ కుమార్ సురేఖ దంపతులకు పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు, అధికారులు, వరికుంట్ల అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వార్షికోత్సవ సందర్భంగా పొదిలిలోని దేవస్థానాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆ భగవంతున్ని దయ తో భాసిల్లాలని వరికుంట్ల దంపతులు ప్రార్థించారు. వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆశీస్సులు, శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి వరికుంట్ల అనిల్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. తన రాజకీయ ఉన్నతి కి సహకరిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి నిండు నూరేళ్లు బాగుండాలని, ఇంకా ప్రజల అభివృద్ధి క్షేమం కోసం పాటుపడాలని ఆ భగవంతుడిని ప్రార్థించినట్లు వరికుంట్ల అనిల్ కుమార్ తెలిపారు.

## మోరబోయిన హుస్సేన్ రావు మృతి బాధాకరం

### ఎమ్మెల్యే డాక్టర్, బోల్లా, ఆకు పాటి

**పామూరు, పెన్ పవర్,మూర్చి21**

మాజీ జడ్పిటిసి, టిడిపి సీనియర్ నాయకులు అకాలమరణం బాధాకరమని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. గురువారం మోరబోయిన హుస్సేన్ రావు యాదవ్ గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డాక్టర్ నరసింహారెడ్డి మోపాడులో భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ప్రగాఢ సంతపాన్న తెలియజేశారు. టిడిపి మండల అధ్యక్షుడు పూవ్వాడీ వెంకటేశ్వర్లు, మెడబలిమి వెంకట్రావు, టిడిపి నాయకులు కార్యకర్తలు నివాళులర్పించారు.





# ఆమ్మో! ముఖ్యమంత్రి పర్యటనా??

## - సి ఎం పర్యటన పేరిట మహిళా సంఘాల నుండి అక్రమ వసూళ్లు







**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 21**

మహిళా సాధికారత కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 8వ తేదీన పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురంలో మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యమంత్రితో పాటుగా రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం మొత్తం నిమగ్నమై ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు మొత్తం పూర్తిచేసి సభను విజయవంతం చేశారు. అంతవరకు బాగానే ఉంది. ప్రధానంగా సభలు విజయవంతం కావాలంటే ప్రజలు అవసరం. ఆ ప్రజలు కూడా మెప్మా.. డ్వాక్రా సంఘాలకు సంబంధించిన సభ్యులైతే సభలు విజయవంతం అవుతాయని ఉద్దేశంతో ప్రభుత్వ అధికారులు వారిని తరలించే ప్రయత్నం చేస్తుంటారు. అందులో భాగంగా మార్కాపురం సభకు కూడా మెప్మా.. డ్వాక్రా సంఘాల సభ్యులను తరలించారు. సభ్యులకు అవసరమైన ఏర్పాట్లు చూడవలసిన బాధ్యత అధికార యంత్రాంగం పై ఉంది. కానీ ఒంగోలు నుండి మార్కాపురం తరలించేటప్పుడు ఉచితంగా బస్సులు మినహా ఇతర ఖర్చులన్నీ కూడా సభ్యులే భరాయించుకోవలసి వచ్చిందని సమాచారం. ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఆర్థిక వనరులను కూడా జిల్లా యంత్రాంగం చూసుకుంటుంది. కానీ సభ అయిపోయి 15 రోజులు దాటిన ఒంగోలు నగర పరిధిలోని మెప్మా స్వయం సహాయ సంఘాల సభ్యుల నుండి ఒక్కొక్క సంఘానికి 400 రూపాయలు చొప్పున చెల్లించాలని సీఈవోల ద్వారా సందేశాలు పంపుతున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి పర్యటనకు 50 వేల రూపాయలు పైన ఖర్చులు అయ్యాయి అని ఆ ఖర్చులు సభ్యులు భరించాల్సిందేనని చెప్పి హుకుం చేస్తున్నట్లుగా తెలుస్తుంది. మార్కాపురంలో జరిగిన సభకు ఒంగోలు స్వయం సహాయ సంఘాల సభ్యులు ఎందుకు డబ్బులు ఇవ్వాలి? ఇదేమిటని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని విశ్వసనీయ సమాచారం.

ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రజాప్రతినిధుల వద్ద మెప్పు పొందేందుకు కొంతమంది అధికార యంత్రాంగం ప్రగల్బాలకు పోతూ తమ ఇమేజ్ ను పెంచుకునేందుకు కొంతమంది మహిళా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి తోడు ప్రజాప్రతినిధుల గృహిణులతో ఈ మెప్మా మహిళా అధికారులతో సత్సంబంధాలు పెంచుకుంటూ ఒకరి మీద ఒకరు చాడీలు చెబుతూ డబ్బులు ఇవ్వకపోతే బెదిరించే పనిలోకి దిగుతున్నారని సమాచారం. ఏదేమైనా ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చిన సందర్భంలో అయిన ఖర్చులకు స్వయం సహాయ సంఘ సభ్యులకు సంబంధం ఏమిటి అనేది ఇక్కడ అసలు ప్రశ్న. దీనిపై ఆర్పీల యూనియన్ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగినట్లుగా తెలుస్తుంది. మొత్తం మీద ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన వ్యవహారంలో అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనేది విశ్వసనీయ సమాచారం. త్వరలోనే ఈ అంశంపై పెద్ద ఎత్తున దుమారం లేచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# హాస్టళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

**- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్**





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 21**

ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ మున్సిపల్ శాఖ, డీడీ సోషల్ వెల్ఫేర్ అధికారులు, కార్పొరేషన్ ప్రజాప్రతినిధులతో శుక్ర వారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒంగోలు నగరానికి మంజూరు కాబడిన సోషల్ వెల్ఫేర్ కాలేజీ బాయ్స్ హాస్టల్ 6.00 కోట్లతో మంజూరు కావడం జరిగినది. హాస్టల్ నిర్మాణానికి దామచర్ల ఆంజనేయులు పాలిటెక్నిక్ కాలేజీ నందు స్థలం కేటాయించడం జరిగినందున త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తూర్పుపాలెం నందు సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ 3,7 లు కూడా 3.00 కోట్లతో నూతన భవనాలు మంజూరు కావడం జరిగినదని సదరు హాస్టల్స్ నిర్మాణానికి పీవీ ఆర్ బాయ్స్ స్కూల్ దగ్గరగా స్థలం ఏర్పాటు చేయాలని మునిసిపల్ శాఖ అధికారులను కోరారు. అనంతరం నగర పాలక సంస్థ ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశం లో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చిన్న చిన్న సమస్యలు వుంటే త్వరగా పూర్తి చేయాలని కోరారు. నగర అభివృద్ధికి కార్పోరేటర్లు సహాయసహకారాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో మేయర్ గంగాడ సుజాత , కమిషనర్ డాక్టర్ కోడూరి. వెంకటేశ్వరావు, డీడీ సోషల్ వెల్ఫేర్ లక్ష్మణ్ నాయక్, ఈఈ భాస్కర్ రావు, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్లు , అధికారులు పాల్గొన్నారు.

# మసీదుల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

**:ఎంపీడీవోలకు ఎమ్మెల్యే ఇంటూరి ఆదేశాలు**



**కందుకూరు పెన్ పవర్, మార్చి 21**

నియోజకవర్గం లోని అన్ని మసీదులు, ఈద్గాల వద్ద పరిసరాల పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీవోలతో పాటు కందుకూరు మున్సిపల్ కమిషనర్ అనూష ను కూడా పట్టణంలోని మసీదుల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవోలతో నాగేశ్వరావు మాట్లాడుతూ రంజాన్ పర్వదినం ను ముస్లింలు పవిత్రంగా జరుపుకుంటారని పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. మసీదుల వద్ద పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టేలా పంచాయతీ సెక్రెటరీ లను ఆదేశించాలని ఎంపీడీవోలను కోరారు.

# స్వర్ణాంధ్ర స్వచ్ఛఃస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఆకుపాటి

**పామూరు, పెన్ పవర్,మార్చి21.**

పట్టణంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో జరుగుతున్న స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రసంగించిన ప్రకాశం జిల్లా ఎంపీటీసీ ల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆకుపాటి వెంకటేష్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామూరు లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం లోకల్ ట్రైనింగ్ సెంటర్ గా అభివృద్ధి చెందడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే ఇంటూరి ని సత్కరించిన ఎస్సీ మాదిగ నాయకులు





**కందుకూరు పెన్ పవర్, మార్చి 21:**

కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలోని ఎస్సీ మాదిగ నాయకులు శుక్రవారం కందుకూరు ఆర్ అండ్ బి అతిథిగృహంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి ఎస్సీ వర్గీకరణకు సహకారం అందించినందుకు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించిన ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 30 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్య సుప్రీంకోర్టు తీర్పుతో గురువారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ , శాసనమండలిలో వర్గీకరణకు అనుకూలంగా ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు , సహకారం అందించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కందుకూరు నియోజకవర్గం పరిధిలోని మాదిగలందరూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావుకు కూటమి ప్రభుత్వానికి , రుణపడి ఉంటామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏ పిలుపు ఇచ్చిన శిరసావహించి ఆ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయడంలో కీలక భూమిక పోషిస్తామని ఎమ్మెల్యే కి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య , క్రిస్టియన్ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు రెబ్బవరపు మాల్యాద్రి , బద్దిపూడి శిఖామణి, ఎస్సీ సెల్ గుడ్లూరు మండల అధ్యక్షులు తాటిపర్తి రామకృష్ణ , దువ్వూరి రమేష్ చంద్ర , గడ్డం నవీన్ , గౌడపేరు ప్రసాదరావు , జడ రవీంద్రబాబు , ఎండ్లూరి పుల్లయ్య , మందా పరిశుద్ధరావు ,ఉచ్చులూరి నిరంజన్ , ఉచ్చులూరి సుబ్బారావు , బొక్క మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు సూచించిన డాక్టర్ ఉగ్ర




**పామూరు,పెన్ పవర్,మార్చి21.**





పట్టణంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రమును స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు సూచించిన కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి. స్థానిక చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ను లోకల్ ట్రైనింగ్ సెంటర్ గా అభివృద్ధి చేయడం జరిగిందని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని 6 మండలాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకుల ను కలుపుకొని ముందుకు సాగాలని ఆయన సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏ గ్రామానికి ఆ గ్రామం యూనిట్ గా తీసుకొని పరిశుభ్రతలో పోటీ పడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, సయ్యద్ అమీర్ బాబు, ఉప్పలపాటి హరిబాబు, ఈవో జీవి అరవింద రెడ్డి, మెంటా నరసింహారావు, పందిటి హరీష్, పిడుగు శ్రీనివాసులు, కొండిశెట్టి రమణయ్య, షేక్ కాజా రహమతుల్లా, సోమిశెట్టి శ్రీనివాసులు పలువురు పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు అప్పారి వెంకటస్వామికి ఘన నివాళులు



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 21**

గిద్దలూరు డివిజన్ పరిధిలోని గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాలు సంయుక్తంగా గిద్దలూరు యూటిఎఫ్ ఆఫీసు లో నిర్వహించిన సమావేశానికి డాక్టర్ మొర్రి.పిచ్చయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి యం. సత్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. హాజరైన సభ్యులు అప్పారి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మొర్రి. పిచ్చయ్య మాట్లాడుతూ అప్పారి వెంకటస్వామి యూటిఎఫ్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి 25 సంవత్సరాల పాటు పని చేశారన్నారు. ఉపాధ్యాయ లోకానికి విస్తృతమైన సేవలు అందించారని, యూటీఎఫ్ సంఘ బలోపేతానికి అవిరామ కృషి చేశారని, తన 14 సంవత్సరాల సర్వీస్ ను కూడా వదులుకొని సంఘానికి విస్తృతమైన సేవలు అందించిన గొప్ప ఉద్యమ నాయకుడని అన్నారు. ఉపాధ్యాయులకు డైరీలు, జీవోల ప్రచురణ పుస్తకాలు, 10. తరగతి విద్యార్థులకు ముఖ్యమైన స్టడీ మెటీరియల్స్ తయారు చేయించే కార్యక్రమాలల్లో క్రియాశీలకంగా పాల్గొన్నరన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, గిద్దలూరు మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాచర్ల మండల ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, యూటీఎఫ్ నాయకులు జయ చంద్రారెడ్డి, ట్రెజరర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద రాజుపాలెం సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు



**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 21**

చంద్రశేఖరపురం మండలంలోని పెద్ద రాజుపాలెం సచివాలయం లో శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ పరిధిలోని ఎగువపల్లి పెద్దరాజుపాలెం తిమ్మరాజుపాలెం నలజనంపాడు గ్రామంలోని 0 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించారు ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని చిన్నపిల్లలు ఆధార్ నమోదుతో సహా పలువురికి చిరునామా మార్పు పేర్లు తప్పులు సరిచేసి నమోదు సవరణ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి తెలిపారు పంచాయతీ పరిధిలో దాదాపు 30 మంది పిల్లలకు నమోదు సవరణలు చేసినట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, ఆధార్ నమోదు డిజిటల్ అసిస్టెంట్ మమత, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌కు ఎమ్మెల్యే రాక

**కనిగిరి ఆర్సీఇంచార్జి పెన్ పవర్ మార్చి 21**

నేడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ప్రజా దర్బార్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి హాజరు కానున్నట్లు కార్యాలయ ప్రతినిధి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. సమస్యలు తెలియజేసే అర్జీ దారులు అర్జీలపై ఆధార్ నెంబర్ మరియు సెల్ నెంబర్ తప్పనిసరిగా రాసి జిరాక్స్ తీసుకురావాలని చెప్పారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# చేనేతలకు ఉచిత విద్యుత్తు హర్షనీయం











**చీరాల,పెన్ పవర్,మార్చ్ 21**

చీరాల బస్టాండ్ దగ్గర తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ముక్కోనపు పార్కు దగ్గర డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, గడియార స్తంభం దాకా చేనేతలతో పాదయాత్రగా వచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు , మంత్రివర్యులు నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్ మరియు ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత , కూటమి నాయకులు మరియు చేనేత కార్మికులు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేతలకు మొదటి నుంచి చేయూతనిచ్చేది తెలుగుదేశమేనని... చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ అన్నారు. చేనేతలకు గతంలో రుణమాఫీ చేసిన ఘనత చంద్రబాబుదేనని గుర్తుచేశారు. చంద్రబాబు స్ఫూర్తితో... చేనేతల ఇళ్లకు 200యూనిట్లు, పవర్ లూమ్స్ కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు మంత్రి లోకేష్ కృషి చేశారన్నారు. అలాగే మన శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య చీరాల నందు టెక్స్టైల్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారని అన్నారు. వైసిపి హయాంలో చేనేత దినోత్సవం నాడే నేతన్నల ఆత్మహత్యలు జరిగేవన్న అన్నారు. కూటమి ప్రభుత్వంలో చేనేతలకు ప్రతీరోజూ పండుగేనన్నారు. అనంతరం మిఠాయిలు పంచి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత చేనేత కార్మికులు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు సన్నిహితులు పాల్గొన్నారు.

## యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి

### అవగాహనతోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు చెక్

### జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి

**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 21:**

చిలకలూరిపేట:ఆన్‌లైన్ బెట్టింగ్‌లు యువత జీవితాలను దెబ్బ తీస్తున్నాయంటూ జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రోజుకు ఎన్నో ప్రాణాలు ఈ జూదాల వల్ల సమసిపోతున్నాయనీ, పరిస్థితి మరింత విషమించకముందే తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.




**అవగాహనతోనే పరిష్కారం....**

తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన సొమ్మును ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పణంగా పెట్టి, నష్టపోయి అప్పుల కుప్పల్లో కూరుకుపోయే యువత ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు మారుమూల ప్రాంతాల్లోనూ విస్తరించాయని బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ రాయుళ్లు తొలుత స్వల్ప డబ్బులు గెలిపించి వినియోగదారుల్లో మోజు పెంచుతున్నారని, ఆ తర్వాత దారి తప్పించి వారిని నష్టాల ఊబిలోకి తోసేస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు విస్తరిస్తున్నాయని, ఈ ప్రమాదకర వ్యసనంపై యువత ఆసక్తి చూపుతోందని పేర్కొన్నారు. ఈ గేమ్‌ల ప్రభావానికి చిక్కుకున్న వారు డబ్బులు కోల్పోవడమే కాకుండా సైబర్ నేరగాళ్ల వలలో పడిపోతున్నారని ఆయన వివరించారు.పోలీసు శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించి నిఘా వ్యవస్థను మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత తమ భవిష్యత్‌ను కాపాడుకోవడంలో జాగ్రత్త వహించాలని, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వలయాల్లో పడకుండా అవగాహన పెంచుకోవాలన్నారు. "మోసపూరిత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు వ్యతిరేకంగా నిలబడి యువత సమాజ నిర్మాణంలో చైతన్యవంతులుగా వ్యవహరించాలి" అని ఆయన సూచించారు.

## మెడికల్ కిట్లు పంపిణీ చేసిన ఎంపీడీవో వి. హేమలత దేవి.



**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 21**

యడ్లపాడు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీల కొరకు మెడికల్ కిట్లు (మందులు,ఓ ఆర్ ఎస్ మరియు ఫస్ట్ ఎయిడ్ కిట్లు) పంపిణీ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వి. హేమలత దేవి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు అందచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి హేమలత దేవి తో పాటు ఎడ్లపాడు పీహెచ్సీ సిహెచ్ఓ పున్నారావు, రాజశేఖర్ మరియు ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ ఏపీవో సుందర రావు, టెక్నికల్ అసిస్టెంట్ మాధవి మరియు ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శ



**పెన్ పవర్ , మార్చి 21, అద్దంకి**

మండలంలోని పలు గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు అనారోగ్యానికి గురి కావడంతో విషయం తెలుసుకున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మండలంలోని గురిజేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పేరుమాళ్ల వీరయ్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో నివాసానికి వెళ్లి వీరయ్య ఆరోగ్య విషయమై వాకబు చేసి పరామర్శించారు.అలాగే అదే గ్రామంలో రాయిపూడి అనిల్ మాతృమూర్తికి ఇటీవలే అగ్ని ప్రమాదవశాత్తు చేతులకు గాయాలు కాగా వారి నివాసానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని పరామర్శించారు. చవిటిపాలెం గ్రామంలో మర్లపాటి ప్రసాదు ఇటీవలే అనారోగ్యంతో మరణించగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు శ్రీ గొట్టిపాటి రవికుమార్ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ధూపాటి ఏసోబు. బాపట్ల పార్లమెంటరీ నాయకులు తేలప్రోలు రమేష్,మండల నాయకులు అట్లా పెద్ద వెంకటరెడ్డి, చేవూరు వాసు రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సన్నబోయిన గురుబ్రహ్మం, తదితర మండల నాయకులు పాల్గొన్నారు.



## కర్లపాలెంలో జరుగుతున్న శానిటేషన్ పనులను దగ్గరుండి పర్యవెక్షిస్తున్న మండల అభివృద్ధి అధికారి అద్దూరి శ్రీనివాసరావు




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి:**

కర్లపాలెం సెంటర్ లో ఫ్రూట్ షాప్ లు, టైలరింగ్, టిఫిన్ షాప్ లు ఇతరత్రా దుకాణదారులు వ్యర్థాలను రోడ్లపై వేయకుండా డస్ట్ బిన్లను ఉపయోగించాలని సూచించారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత మనందరిపై ఉందని ఎండిఓ అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు.

## జిల్లా గీతం పై మనో తో కలెక్టర్ సమావేశం



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 21:**

బాపట్ల జిల్లా గీతాన్ని పాడాలని జిల్లా కలెక్టర్ జె .వెంకట మురళి చేసిన విజ్ఞప్తి మేరకు ప్రముఖ గాయకులు మనో నాగుర్ బాబు శుక్రవారం జిల్లా కలెక్టర్ ను ఆయన చాంబర్లో కలిశారు.. చందోలు బంగ్లాముఖి దేవాలయానికి వెళ్తూ, మార్గమధ్యం లో ఆయన కలెక్టర్ ను కలిశారు. కలెక్టర్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. వారిరువురు 10 నిమిషాల పాటు జిల్లా గీతం పై చర్చించుకున్నారు. కలెక్టర్ కోరిక మేరకు బాపట్ల జిల్లా గీతాన్ని ఆలపించడానికి మనో అంగీకరించారు. బాపట్ల జిల్లా గీతాన్ని తయారు చేయాలని గత ఏడాది కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, భావపరి పుస్తకో ద్యమ సమితి వారు బాపట్ల చరిత్ర ప్రతిబింబించే విధంగా జిల్లా గీతాన్ని రచించాలని రచయితలకు విజ్ఞప్తి చేస్తూ పోటీ నిర్వహించారు. ఈ పోటీలకు 10 ఎంట్రీలు వచ్చాయి. వీటిని అప్పటి జిల్లా విద్యాశాఖ అధికారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలించి, భావపురి రచయుతల సంఘం కార్యదర్శి నందిరాజు విజయ్ కుమార్ రచించిన గీతాన్ని బాపట్ల జిల్లా గీతంగా ఎంపిక చేశారు.

బాపట్ల జిల్లా విశిష్టతపై ఫోరం ఫర్ బెటర్ బాపట్ల వారు ప్రచురించిన కరపత్రాన్ని కలెక్టర్ ద్వారా మనోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు, కాకుమాను గురుకుల పాఠశాల సంగీత ఉపాధ్యాయుని అచ్యుతుని నాగపూర్ణ రమాదేవి, పుస్తకోద్యమ సమితి కార్యదర్శి జీవీ పాల్గొన్నారు.

## కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**వేటపాలెం, పెన్ పవర్, మార్చ్ 21**

వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని నాయినపల్లి కొత్త కాలవ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న చెక్కవాలు బ్రిడ్జి సమీపంలో శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో మృతదేహాన్ని వెలుపలకు తీసి చీరాల ఏరియా హాస్పటల్ కి పోస్టుమార్టం నిమిత్తం పంపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.





# ఏపీలో మెడికల్ షాపులు, ఏజెన్సీలో తనిఖీలు

## ఆపరేషన్ గరుడలో భాగంగా

## కృష్ణా జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న మెరుపు దాడులు

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, కృష్ణా/మచిలీపట్నం మార్చి 21:**

ఆంధ్రప్రదేశ్ లో మెడికల్ షాపులు, ఏజెన్సీలపై డ్రగ్ ఇన్స్పెక్టర్లు, విజిలెన్స్, పోలీస్ అధికారులు దాడులు నిర్వహించారు. ఉమ్మడి కృష్ణ జిల్లాలో మెడికల్ ఏజెన్సీలు మందుల షాపులపై విజిలెన్స్, డ్రగ్ ఇన్స్పెక్టర్లు, ఈగల్ బృందాలు తనిఖీలు చేపట్టాయి.మందుల నాణ్యత, రికార్డులను అధికారులు పరిశీలించారు. ఈగల్ అధికారుల బృందం జిల్లాలోని పలుచోట్ల మెడికల్ ఏజెన్సీలలో ఆకస్మిక తనిఖీలు చేశారు. మెడికల్ గా ఒకే మోతాదులో వినియోగించే సిరఫ్, ఇంజక్షన్లు మత్తు మందులను కొంతమంది యువత అక్రమంగా వినియోగిస్తోంది. ఈ నేపథ్యంలో డీజీపీ ఆదేశాలతో మెడికల్ షాపులలో కృష్ణాజిల్లా వ్యాప్తంగా నాలుగు ప్రత్యేక బృందాలు ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. జిల్లాలో కొన్ని చోట్ల డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తున్న ట్రమడాలు మత్తుమందులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యువత కొంతమంది తప్పుడుగా వైద్యం కోసం వినియోగించే మత్తు కలిగించే మెడిసిన్స్ ను విరివిగా వాడుతున్నట్టు సమాచారం. అందుకే డిజేపీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా దాడులు చేస్తున్నామని ఈగల బృందాలు తెలిపారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ ఏజెన్సీలో, మెడికల్ షాపులలో ట్రమాడాల్ ఇంజక్షన్లు, మత్తు కలిగించే సిరఫ్ లు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా 100 బృందాల ఆధ్వర్యంలో ఆపరేషన్ గరుడ నిర్వాహిస్తున్నామని ఈగల్ టీమ్ ఐజీ రవి కృష్ణ తెలిపారు. గుణదల మెడికల్ షాప్ లో ఆకస్మిక దాడులు చేశారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతి లేని మందులు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రిస్క్రిప్షన్ మీద అమ్మవలసిన మందులు మాత్రమే మందుల షాపులో విక్రయించాలి. అలా లేనియెడల వారిపై చర్యలు తీసుకుంటామని డ్రగ్స్ డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్ వెల్లడించారు.

# పెన్ పవర్

## గుంటూరు । బాపట్ల । పల్నాడు

## పట్టణ తాగునీటి సమస్య పై ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం

### వేసవిలో నీటి ఎద్దడి నివారణ కోసం అన్ని చర్యలుతీసుకుంటున్నాము:చైర్మన్ షేక్ రఫాని.

**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 21:**

చిలకలూరిపేట : పట్టణ ప్రజలకు రోజువారి మంచినీటి సరఫరా జరగాలన్న మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు వారి ఆకాంక్షల మేరకు ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారని,అనుకున్న సమయానికి సక్రమంగా పనులు పూర్తి అయితే ఈ వేసవి నుండే పట్టణ ప్రజలకు రోజువారి మంచినీటి సరఫరా జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అమృత్ పథకానికి సంబంధించిన ఇంటర్ కనెక్షన్ పనులు మరియు పైప్ లైన్ల లీకేజీ మరమ్మత్తులు పనులు జరుగుతున్న దృష్ట్యా ప్రస్తుతం వేసవిలో నీటి ఎద్దడి నివారణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాము అని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పేర్కొన్నారు.శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదుల పైన మున్సిపాలిటీ పరిధి వార్డుల్లోని తాగునీటి సమస్య పై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు.ఏ ఏ వార్డుల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉందో గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎండలు మరింత ముదిరి,తీవ్ర నీటి ఎద్దడి నెలకొనే అవకాశం ఉందన్నారు.ఈ నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించామని,అవసరమైన ప్రాంతాల్లో వెంటనే వాటర్ పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలన్నారు.వేసవి కాలంలో ముఖ్యంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచినీటి



సరఫరా చేయాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల అమలకు కృషి చేస్తామని వారు తెలిపారు.అధికారులుస్థానిక వార్డు కౌన్సిలర్లను, ప్రజల సమన్వయం చేసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి.ఈ అబ్దుల్ రహీం, ఏ.ఈ చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలి దళిత ప్రజా సంఘాలు



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి21:**

సంవత్సరం ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీ ఎస్టీ వర్గీకరణ చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వానికి అధికారాన్నిస్తూ ఒక తీర్పుని వెలువడించింది అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఏకసభ్య కమిషన్ రాజీవ్ మిస్రా ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆయన 13 జిల్లాల్లో పర్యటించి కేవలం ఎస్సీ కులంలో ఉన్న మాదిగల విన్నపాలే తీసుకుని మాలలకు అన్యాయం చేయాలని కుట్ర చేసినట్టుగా మాకు అర్థమవుతుంది 2011 జనాభా లెక్క ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పటం మరి ఇప్పుడు వరకు దళితుల్లో బిడ్డలు పుట్టలేదా జనాభా అభివృద్ధి జరగలేదా అని ప్రశ్నిస్తున్నాం ఈ సందర్భంగా బాపట్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి దళిత బహుజన సంఘాల నాయకులు హాజరయ్యారు సీనియర్ దళిత నాయకులు అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చారువాక మాట్లాడుతూ 2011 తర్వాత ఆంధ్రప్రదేశ్ లో జనాభా లెక్కలు తీలేదని జనాభా లెక్కలు తీయకుండా కులగణ జరక్కుండా ఎలా వర్గీకరిస్తారు ఎస్సీలని ఒకసారి కూటమి ప్రభుత్వం పునరాలోచించి దళితవాడలోని ఇంటింటికి తిరిగి జనాభా లెక్క తీసి ఎస్సీలో పేదరికం అనిపిస్తున్న వారు ఎవరు ఆర్థికంగా బలపడ్డ వారెవరు అని సర్వే చేసి అప్పుడు వర్గీకరించాలని డిమాండ్ చేస్తున్నాము ఇది కేవలం మాలా మాదిగల మధ్య వివాదాన్ని సృష్టించి వాళ్ళ రాజకీయాల్ని పబ్బం గడుపుకోవడమేనని చారువాక అన్నారు జై భీమ్రావు పార్టీ బాపట్ల నియోజకవర్గ కన్వీనర్ కొచ్చెర వినయ్ రాజ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పనిగట్టుకుని మాల మాదిగలని అణచివేసే కుట్ర ఎస్సీ వర్గీకరణ అని ఆయన అన్నారు బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీలను అణచివేయాలని చూస్తే బి.ఎస్.పి అధినేత కుమారి మాయావతి ఎస్సీల్ని వర్గీకరించడం అంటే వారిని మరింత అణచి వేయడమే అని ఆమె అన్నారు బీఎస్పీ పార్టీ ఎస్సీ వర్గీకరణ ను వ్యతిరేకిస్తున్నామని ప్రకటించారు రాష్ట్ర మాలమహానాడు అధికార ప్రతినిధి శీలం రోజున బాబు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రావడానికి మాలలు ఎంతో దోహదపడ్డారని ఆరోజు మాల సంఘాలు అందరం కూడా కలిసి చంద్రబాబు నాయుడు కి మద్దతు ప్రకటించామని ఈరోజు ప్రభుత్వం ఇలా ఎస్సీలను వర్గీకరించటం సరైనది కాదని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గుద్దే రాజారావు గొర్రెముచ్చు వందనం డాక్టర్ కాగిత వరప్రసాద్ పర్రే కోటయ్య కొరగంటి శ్యాము జోగి ప్రసంగి తురిమెళ్ళ అమ్మేశ్వరరావు పేర్లి కాంతారావు రేగులగడ్డ చంద్రశేఖర్ దాసి నాగేశ్వరరావు దళిత నాయకులు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## షార్టుట్ పోటీలో చీరాల ఎమ్మెల్యే కొండయ్యకి బహుమతి

**చీరాల, పెన్ పవర్, మార్చ్ 21**

ఏపీ లెజిస్లేటివ్స్ స్పోర్ట్స్ మీట్ 2025లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల షార్టుట్ పోటీలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు చేతుల మీదుగా మద్దులూరికి ట్రోఫీని అందజేశారు.




# బందరు అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి : మంత్రి కొల్లు రవీంద్ర

**బ్యూరో రిపోర్ట్, పెన్ పవర్ కృష్ణా/ మచిలీపట్నం మార్చి 21:**

బందరు అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు సహకారం అందించాలని గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రజలను కోరారు.బందరు స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మచిలీపట్నం నగర పరిధిలోని పాత రైల్వే స్టేషన్ నుంచి బందరుకోటకి వెళ్లే రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, ఇతర కూటమి నాయకులతో కలిసి మొక్కలను నాటారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలో మచిలీపట్నం పోర్టు రోడ్డుకు ఎంతో ప్రత్యేకత ఉందని, గతంలో పోర్టుకు వెళ్లేందుకు ఈ రహదారిని ప్రధానంగా ఉపయోగించడం వల్ల పోర్టు రోడ్డుగా ప్రసిద్ధి చెందిందని నాటి సంగతులను మంత్రి గుర్తు చేశారు. తర్వాతి క్రమంలో రహదారి పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో అధ్వానంగా తయారైందని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్వచ్ఛ బందరు కార్యక్రమంతో మొత్తం శుభ్రం చేశామన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డును మరింత సుందరీకరణగా తీర్చిదిద్దే క్రమంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటి పచ్చదనంతో ఆహ్లాదకరంగా మార్చేందుకు నేటి కార్యక్రమంతో శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వం, కూటమి నాయకుల సహకారంతో నగరం మొత్తాన్ని ఇదే రీతిలో పచ్చదనంగా మార్చేందుకు, రహదారులను సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ ప్రణాళికలో భాగంగా నగరంలో రహదారులకిరువైపులా ఉన్న ఆక్రమణలను ఇప్పటికే తొలగిస్తూ వస్తున్నామని, అయితే చేస్తున్న ఈ పనిని అతి తక్కువ మంది




వ్యతిరేకిస్తున్నప్పటికీ అధిక మొత్తంలో ప్రజలందరూ హర్షిస్తున్నారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని, తమ సలహాలు, సూచనలతో బందరు అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.విజన్ 2047, పీ4 కార్యక్రమాలు పేదరికం లేని సమాజ నిర్మాణం, పరిశుభ్రత, సుందరీకరణ, పట్టణ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలన్నారు.నగరంలోని రహదారులపై పశువుల సంచారంతో ప్రమాదాలకు ముప్పుగా మారిందని, దీనిని అధిగమించేందుకు మంగినపూడి బీచ్ ప్రాంతంలో 15 ఎకరాలు కేటాయించి, పట్టించుకోని పశువులను అక్కడకు తరలించడం జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలోని ముడా ఏరియాని సి ఆర్ డి ఏ రాజధాని పరిధిలోకి తీసుకువచ్చే విధంగా జిల్లాలోని ముఖ్య నాయకులతో త్వరలో ముఖ్యమంత్రిని కలిసి



అభ్యర్థిస్తామన్నారు.ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రత రెండూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలని, ఆ స్ఫూర్తితో మచిలీపట్నం నగరాన్ని పచ్చదనంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు ఎంతో సహకారాన్ని అందిస్తున్నారన్నారని, వారి సహకారంతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపిచంద్, కూటమి నాయకులు బండి రామకృష్ణ, కుంచె నాని, తలారి సోమశేఖర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, జిల్లా ప్రజా రవాణా అధికారి వాణిశ్రీ, మచిలీపట్నం డిపో మేనేజర్ పెద్దిరాజులు, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## నాటి దివంగత నేత వైఎస్సార్ నుంచి నేటి వైఎస్ జగన్ వరకు

# మర్రి రాజశేఖర్ గౌరవాన్ని తగ్గించలేదు

### తమ నాయకుడు మర్రి రాజశేఖర్‌ను మోసం చేయలేదు –మాజీ మంత్రి విడదల రజిని

**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 21:**

చిలకలూరిపేట:నాటి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి నేటి వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి వరకు ఎమ్మెల్సీ రాజశేఖర్‌కు అన్ని విధాలుగా మంచే చేశారని, ఆయన గౌరవాన్ని పెంచే విధంగానే వ్యవహరించారని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ రోడ్డులో ఉన్న ఆమె నివాసంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన మర్రి రాజశేఖర్ వైసీపీ అధినేత జగన్ పై చేసిన వాఖ్యలను ఆమె ఖండించారు. 20o4 ఎన్నికల్లో ఇండిపెండింట్ పోటీ చేసిన రాజశేఖర్‌కు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ ప్రచార సభలో కాంగ్రెస్ పార్టీకి కాదని, రైలు ఇంజన్‌కు ఓటు వేయాలని చెప్పి గెలిపించి ఆయన గౌరవం కాపాడారని వెల్లడించారు. 2009 ఎన్నికల్లో సైతం టికెట్ కేటాయించినా ఓటమి చెందినా ఆయనను దివంగత నేత మర్రి రాజశేఖర్ గౌరవం తగ్గించలేదని గుర్తు చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఆవిర్భావం అనంతరం కూడా పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహనరెడ్డి ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా




నియమించి గౌరవించారని, అనంతరం ఎమ్మెల్సీ పదవి కేటాయించి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పదవిని కేటాయించి గౌరవించారని వెల్లడించారు. తనను అన్ని విధాలుగా గౌరవించిన పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు మర్రి రాజశేఖర్ వీడటం. ఎమ్మెల్సీని పదవిని వదులుకొని టీడీపీకి అనుకూలంగా వ్యవహరించటం సరికాదన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు అవుతున్న సమయంలో ప్రజల గొంతుకగా మారి ప్రశ్నిస్తే మర్రి రాజశేఖర్ గౌరవం పెరిగేదన్నారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తే ఆ పదవిని టీడీపీ ఖాతాలోకే వెళుతుందన్న విషయం ఆయనకు తెలియదా అన్ని ప్రశ్నించారు.

**పార్టీ అదిష్టానం సూచించిన విధంగానే**

పార్టీ అన్నాక అనేక వ్యూహాలు ఉంటాయని, ఆ వ్యూహం ప్రకారం గెలుపు ఓటములు, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని నిర్ణయాలు ఉంటాయని రజిని వెల్లడించారు. తాను పార్టీ అధిష్టానం సూచించిన విధంగానే నడుచుకున్నానని, పార్టీ అధినేత జగన్ ఆదేశాలను తూచ తప్పకుండా అచరిస్తానని రజిని వెల్లడించారు. ఇందులో భాగంగానే 2019 తనకు టికెట్ కేటాయించారని, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజల దీవెనలతో ఘన విజయం సాధించామని గుర్తు చేశారు. అనంతరం అధిష్టానం నిర్ణయం మేరకే చిలకలూరిపేటకు వీడి గుంటూరు వెస్ట్ నియోజకవర్గానికి వెళ్లాల్సి వచ్చిందని, అలా చిలకలూరిపేటను వీడి వెళ్లడం ఇష్టం లేకపోయినా పార్టీ అధినేత నిర్ణయాన్ని దిక్కరించలేనని వివరించారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. మర్రి రాజశేఖర్ తనకు టీడీపీలో గౌరవం లభిస్తుందని ఆశిస్తున్నారని, ఆలా గౌరవించబడాలని కోరుకుంటున్నానని తెలిపారు.

# వైసీపీలో కలకలం దొంగ సంతకాలపై చర్చ

**విజయవాడ, మార్చి 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ సమావేశాలను వైఎస్ఆర్‌సీపీ బహిష్కరించింది అనేది అందరికీ తెలిసిన విషయం. అయితే ఏడుగురు ఎమ్మెల్యేలు మాత్రం రహస్యంగా వచ్చి హాజరైనట్లుగా రిజిస్టర్ లో సంతకాలు చేసి వెళ్లారు. మొత్తంగా ఉన్నకొండు మంది ఎమ్మెల్యేల్లో జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రం సంతకాలు చేయలేదు. అసెంబ్లీ చివరి రోజున ఈ విషయం స్పీకర్ అయ్యన్న పాత్రుడు దృష్టికి వచ్చింది. ఆయన సభలో ప్రకటించారు వైసీపీ ఎమ్మెల్యేలు దొంగల్లా వచ్చి రిజిస్టర్ లో సంతకాలు పెట్టి కోవాల్సిన అవసరం ఏముదంని ప్రశ్నించారు. ఆయన బయట పెట్టడంతో ఆ ఎమ్మెల్యేలు ఎవరో తెలిసిపోయింది. స్కూలు, ఆఫీసుల్లో విద్యార్థులు, ఉద్యోగులు పంచ్ కొట్టి బయటకు వెళ్లిపోయినట్లుగా ఈ ఎమ్మెల్యేల వ్యవహారం ఉండటంతో ఎమ్మెల్యేల్లోనే కాదు..రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. అసెంబ్లీకి వెళ్లకూడదని అనుకున్నప్పుడు వెళ్లకుండా ఉండాలి కానీ రహస్యంగా సంతకాలు పెట్టాల్సిన అవసరం ఏమిటన్నది చర్చనీయాంశం అయింది. అసెంబ్లీకి హాజరు కాకపోతే అనర్హతా వేటు పడుతుందని స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదే పదే చెబుతున్నారు. అందుకే వారు గవర్నర్ ప్రసంగం రోజున హాజరై కొంత సేపు ఉండి వెళ్లిపోయారు. అయితే తర్వాత ఆ రోజు వర్కింగ్ డే కాదని అసెంబ్లీ వర్గాలు చెప్పాయి. దాంతో మరో రోజు హాజరు కావాల్సిన అవసరం పడింది. అలా హాజరు కాకుండా.. ఎప్పుడు వచ్చారో కానీ.. నేరుగా అసెంబ్లీకి వచ్చి రిజిస్టర్ లో సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. ఒక్క నిమిషం కూడా సభలోకి రాలేదు. ఈ సంతకాలు చెల్లుతాయా లేదా అన్నది స్పీకర్ రూలింగ్ ను బట్టి ఉంటుంది. చెల్లుబాటు అంశంపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఎలాంటి ప్రకటన చేయలేదు. అదే సమయంలో అసెంబ్లీకీ హాజరైనప్పుడు ప్రత్యేకంగా జీతభత్యాలు వస్తాయి. వాటి కోసం సంతకాలు చేసి ఉంటారని అంటున్నారు. ఎమ్మెల్యేలకు జీతభత్యాలు లక్షల్లోనే ఉంటాయి. అసెంబ్లీకి హాజరు కాని కారణంగా వాటిని ఆపేస్తే.. సమస్యలు వస్తాయని వచ్చి సంతకాలు పెట్టి ఉంటారని భావిస్తున్నారు. ప్రజలు ఓట్లు వేసి పంపించింది..అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలు చర్చించడానికి. అయితే ఎమ్మెల్యేలు జగన్ కు ప్రతిపక్ష హోదా ఇవ్వాలన్న కారణంగా అసెంబ్లీకి వెళ్లడం లేదు. జగన్ కు ప్రతిపక్ష హోదా ఇస్తేనే వెళ్తామంటున్నారు. వైసీపీకి ఉన్న పదకొండు మంది ఎమ్మెల్యేలలో చాలా మంది కొత్త ఎమ్మెల్యేలు. అసెంబ్లీకి హాజరై అధ్యక్ష అని ప్రసంగించాలని అనుకుంటున్నారు. కానీ అధినేత అంగీకరించకపోవడంతో అసెంబ్లీకి వెళ్లలేకపోతున్నారు.



**దొంగ సంతకాలపై వైసీపీ సైలెన్స్**

అసెంబ్లీలో వైసీపీ సభ్యులు దొంగల్లా వచ్చి సంతకాలు పెట్టి సభలోకి రాకుండా పారిపోతున్నారంటూ సాక్షాత్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చాలా పెద్ద కామెంట్ చేశారు. సహజంగా ఇలాంటి కామెంట్లపై వెంటనే వైసీపీ నుంచి రియాక్షన్ రావాలి. సభకు వస్తున్నామనో, లేక రాలేకపోతున్నామనో, అసలు తాము సంతకాలు పెట్టలేదనో, లేక తమ పేరుతో ఇంకెవరైనా పెడుతున్నారనో అనాలి. కానీ ఇంత వరకు వైసీపీ నుంచి సౌండ్ లేదు. అంటే దొంగ సంతకాలు నిజమేనని ఆ పార్టీ ఒప్పుకున్నట్టైందని టీడీపీ ఎద్దేవా చేస్తోంది. ఆఖరికి ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న నేతలు కూడా ఇంత చీప్ గా ప్రవర్తిస్తారా అంటూ కౌంటర్లిస్తున్నారు.వైసీపీ వాళ్లు జగన్ ని సింగిల్ సింహంతో పోలుస్తుంటారు. ప్రతి ఎన్నికల్లోనూ ఎవరితో పొత్తు పెట్టుకోకుండా జగన్ సింగిల్ గా బరిలో దిగుతారనేది వారి మాటల సారాంశం. ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్యేలు కూడా జగన్ ని ఒంటరి చేశారంటూ టీడీపీ ఓ రేంజ్ లో కౌంటర్లివ్వడం విశేషం. ఎమ్మెల్యేలుగా తమపై అనర్హత వేటు పడుతుందేమోననే భయంతో కొంతమంది అసెంబ్లీ రిజిస్టర్ లో సంతకాలు పెడుతున్నారు. అయితే సభకు మాత్రం రావడం లేదు. ఇది జగన్ తీర్మానానికి విరుద్ధం. తనను ప్రతిపక్షనేతగా గుర్తిస్తేనే సభకు వస్తామని భీష్మించుకు కూర్చున్నారాయన. అయితే వైసీపీ ఎమ్మెల్యేలు మాత్రం ఆయన శపథం పట్టించుకోకుండా తమ సీట్లు కాపాడుకోవడం కోసం పాకులాడటం విశేషం.జగన్ కి ప్రతిపక్ష నేత హోదా కావాలి, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రం తమ పదవులు మిగలాలి. ఈ క్రమంలో స్పష్టంగా అక్కడ సంఘర్షణ మొదలైంది. ఒకవేళ జగన్ పై అనర్హత వేటు పడినా.. ఆయన మాత్రం తన సీటులో గెలిచే అవకాశాలు ఎక్కువ. అదే సమయంలో మిగతా వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే.. ఆయా ప్రాంతాల్లో వారు గెలవాలంటే కత్తిమీద సాము చేయాలి. ఆర్థికంగా బాగా చితికిపోతారనేది వేరే విషయం. దీంతో వారంతా సేఫ్ గేమ్ ఆడుతున్నారు. అసెంబ్లీకి వచ్చి సంతకాలు పెట్టిపోతున్నారు. అయితే ఇక్కడ సంతకాలపై వైసీపీ పూర్తిగా కార్నర్ అయిపోయింది. తమ సభ్యులు అసెంబ్లీకి వస్తున్నారనే విషయంపై కనీసం స్పందించడానికి కూడా ఆ పార్టీ తరపున ఎవరూ ముందుకు రాకపోవడం విశేషం. ఈ విషయంలో వైసీపీ, ఆ పార్టీ అనుకూల మీడియా తేలు కుట్టిన దొంగలా మారింది. కనీసం దానిపై స్పందించేంత సాహసం కూడా వైసీపీ నేతలెవరూ చేయట్లేదు. జగన్ పేరెత్తితేనే అంతెత్తున ఎగిరిపడే సోషల్ మీడియా మేధావులు కూడా ఈ దొంగసంతకాలను కవర్ చేయలేక కష్టపడుతున్నారు. ఇప్పటి వరకూ వైసీపీ స్పందించలేదంటే దానర్థం దొంగ సంతకాలు నిజమనే. దీంతో ఆ పార్టీ పరువు పూర్తిగా మంటగలిసిందని అంటున్నారు. అయితే ఇక్కడ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాత్రం స్పందించారు. ఇక్కడ కూడా ఆయన బహుజన ఎమ్మెల్యేలను దొంగలన్నారంటూ టాపిక్ ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడం విశేషం. ఆయన రెస్పాన్స్ ని మాత్రం వైసీపీ సోషల్ మీడియా ప్రచారం చేసుకుంటోంది కానీ, పార్టీ తరపున ఎవ్వరూ మాట్లాడే సాహసం చేయడం లేదు.

# జైలు పక్షిలా పోసాని... పాపం.. పట్టించుకొనేవారేరి

**కడప, మార్చి 21, పెన్ పవర్:** పోసాని కృష్ణమురళీ జైళ్లు పట్టుకు తిరుగుతున్నారు. ఒకచోట కస్టడీ అయిపోగానే మరోచోటకు వెళుతూ రాష్ట్రంలోని అన్ని జైళ్లను చుట్టేస్తున్నారు. సినిమా రంగంలో అత్యంత గౌరవ, మర్యాదలు అందుకున్న వ్యక్తికి ఇలా జరగాలని ఎవరూ కోరుకోరు.. కానీ ఆయన ప్రవర్తన, మాటలే ఆయన ప్రస్తుతం అనుభవిస్తున్న జీవితానికి కారణం అని అంతా అంటున్నారు. అయితే.. ఇదే పోసాని ఎవరి కోసం అయితే నోటికి వచ్చినట్లు మాట్లాడారో.. అదే నాయకుడు కనీసం పోసాని గురించి మాట్లాడడం లేదు. ఆయన్ను పలకరించేందుకు సైతం ప్రయత్నించలేదు. ఏ వైసీపీ కోసం అయితే కష్టపడ్డారో, ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నా రో.. అదే వైసీపీ పోసాని గురించి పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. మొదట్లో.. వైసీపీలోని కొంత మంది నేతలు.. ముఖ్యంగా పొన్నవోలు సుధాకర్ రెడ్డి ప్రయత్నాలు చేసారు. కానీ..ఇప్పుడు మాత్రం ఎవరూ స్పందించడం లేదు.కూటమి పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అందరికీ మాటలు హద్దులు దాటాయి. వాళ్ల స్థాయిని, స్థానాన్ని మరిచిపోయి? పార్టీల రొచ్చులో దొర్లారు. అలాంటి వారిలో పోసానికి కూడా పెద్ద గజమాలే వేయాలి అంటున్నారు కూటమి మద్ధతుదారులు. పోసాని కంటే ముందు మరింత పెద్ద సత్కారం చేయాల్సి వస్తే.. బోరుగడ్డ అనిల్ కుమార్ అనే వ్యక్తికి చేయాల్సి ఉంటుంది. అతని నోటికి అయితే పచ్చి బూతులే వస్తుంటాయి. ఆయా వీడియోలు ఇప్పటికీ.. సోషల్ మీడియాలో అందుబాటులోనే ఉన్నాయి. కాగా.. అతని పరిస్థితీ పోసాని లాగానే రాష్ట్రంలోని జైళ్లకు రిమాండ్ మీద సందర్శించుకుని వస్తున్నాడు. వీరిద్దరి విషయంలో వైసీపీ డైరెక్టుగా సపోర్టు చేయకపోవడాన్ని చాలా మంది ప్రశ్నిస్తు న్నారు.వాస్తవానికి వైసీపీ అధినేతకు ఓదార్పులు బాగా కలిసి వస్తాయంటున్నారు కూటమి నేతలు.. ఆయన తొలినాళ్ల నుంచి ఓదార్పులతోనే పార్టీని నెట్టుకు వస్తున్నారు. అలా.. టీడీపీ కేంద్ర కార్యాలయం మీద దాడి కేసులో అరెస్టు అయిన వల్లభ నేని వంశీ, ఎలక్షన్ సమయంలో ఈవీఎం మెషిన్ పగులగొట్టిన కేసులో పిన్నెల్లి రామకృష్ణా రెడ్డితో సహా వివిధ కేసుల్లో జైలుకు వెళ్లిన నందిగం సురేష్ వంటి వారిని జగన్ స్వయంగా పలక రించారు. మిగతా వారికి వైసీపీ కేడర్, జిల్లా స్థాయి పార్టీ నాయకులు అండగా నిలుస్తున్నారు. కానీ.. పోసాని, బోరు గడ్డకు మాత్రం ఎవరూ మద్ధతు నిలవడం లేదు. అంటే.. ఎవరైనా దిగజారుడు మాటలు మాట్లాడితే.. వారిని అవసరాల కు వాడుకుంటారు కానీ, ఆపదలో ఆదుకోరు అనే విషయం వీరిని చూసైనా తెలుసుకోవాలంటున్నారు.పోసాని కృష్ణమురళి సినిమా పరిశ్రమలో గుర్తింపు స్థాయి రచయిత, నటుడిగానే ఉన్నారు. ఆయనను పట్టించుకోని వైసీపీ నాయకులు.. వివాదాస్పద సినిమాల దర్శకుడు రామ్ గోపాల్ వర్మ విషయంలో మాత్రం హడావిడి చేశారు. ఒంగోలు పోలీసు స్టేషన్ లో విచారణకు హజరైన ఆర్జీవీ కి స్వాగతం పలికే దగ్గర నుంచి తిరిగి ఆయన్ను విచారణ అనంతరం విడిచిపెట్టే వరకు దగ్గరుండి వైసీపీ నాయకులు చూసుకున్నారు. అంత మాత్రం గౌరవం కూడా పోసానికి దక్కలేదు.అయితే.. స్టార్టింగ్ లో గట్టిగానే నిలబడిన పోసాని.. ఆ తర్వాత మాత్రం తన మాటల వెనుక అసలు కారణాల్ని వెల్లడించారు. తొలుత వైసీపీ సకల శాఖ మంత్రి సజ్జల రామాకృష్ణ రెడ్డి డైరెక్షన్ లోనే తాను మా టల్ని తూలానని ఒప్పుకున్నారు. ఆ తర్వాత వైసీపీకి చెందిన ఓ పత్రికకు సంబంధించిన వ్యక్తులు అందించిన స్క్రిప్ట్ కారణం గానే మాట్లాడాను అంటూ ఉన్నది ఉన్నట్లు చెప్పేసారు. దాం తో? వైసీపీ కార్నర్ కావాల్సిన పరిస్థితులు తలెత్తాయి. దాంతో.. అతనికి సపోర్టు చేసి మరీ ఇరుకున పడడం ఎందుకులే అనుకుని.. వైసీపీ క్యాడర్ సైలెంట్ అయ్యింది అంటున్నారు.

# వెతుకుతున్న నిఘా కళ్లు

**విజయవాడ, మార్చి 21, పెన్ పవర్:** ట్రాఫిక్ పోలీసులు లేరని లైట్ తీసుకున్నారు.. నిబంధనల్ని పట్టించుకోలేదు. కట్ చేస్తే ఆన్‌లైన్‌లో చెక్ చేస్తే వాహనాలకు భారీగా చలానాలు కనిపించాయి. విజయవాడకు చెందిన ఆటో డ్రైవర్ ఒక రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా జంప్ చేశాడు. రెండు రోజుల తర్వాత ఈ-చలానా చెక్ చేస్తే రెడ్ సిగ్నల్ జంప్ చేసినందుకు రూ.వెయ్యి జరిమానా పడింది. మరో విద్యార్థి హెల్మెట్ లేకుండా ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి ఒకే బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేశారు. దీంతో ఈ బైక్‌కు రూ.2000 జరిమానా పడింది. పోలీసులు లేకుండా జరిమానాలు ఎలా సాధ్యమంటూ ఆరా తీస్తే అసలు సంగతి తెలిసింది.విజజయవాడలో ట్రాఫిక్ కూడళ్లపై పోలీసులు నిఘాను పెంచారు. మొన్నటి వరకు సిగ్నల్స్ దగ్గర వాహనదారులకు అవగాహన కల్పించిన పోలీసులు.. తాజాగా ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ/ ఐటీఎంఎస్ (ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)ల ద్వారా నిఘా పెంచారు. ఐటీఎంఎస్ ద్వారా ఈ చలానాలను నమోదు చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు లేరని గీత దాటితే జరిమానాలు పండుతున్నాయి. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ఈ ఐటీఎంఎస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మార్చి 1 నుంచి అమల్లోకి రాగా.. ముందే అధికారులు ప్రకటనలు కూడా ఇచ్చారు. ఐటీఎంఎస్ విధానం ఉందని చాలామందికి తెలియలేదు.. దీంతో కెమెరాలకు అడ్డంగా దొరికిపోతున్నారు.విజయవాడలో ట్రాఫిక్ పెరిగిపోయింది.. పోలీసు సిబ్బంది కూడాసరిపడా లేరు. అయినా సరే మొన్నటి వరకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. అయితే పోలీసులు లేనిచోట్ల కొందరు వాహనదారులు రెడ్ సిగ్నల్ పడినా ఆగకుండా వెళ్లిపోతున్నారు. ఇలా వెళ్లడంతో మిగిలిన వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. నిబంధనల్ని పాటించనివారిని కట్టడి చేసేందుకుఐటీఎంఎస్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు ట్రాఫిక్ పోలీసులు. విజయవాడలోని ఆరు కూడళ్లలో ప్రయోగాత్మకంగా వీటిని ఏర్పాటు చేయగా.. మరో 10 చోట్ల కూడా తీసుకురావాలని భావిస్తున్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని.. చలనాలు కొని తెచ్చుకోవద్దంటున్నారు పోలీసులు.రెడ్ సిగ్నల్ పడిన తర్వాత వెళితే జరిమానా పడుతుందన్నారు. ట్రాఫిక్ పోలీసులు లేరని ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వెళితే కెమెరాకు దొరికిపోతారంటున్నారు.

### నాడు చంద్రబాబు తల్లి ఆశీస్సులు తీసుకుని

## పాదయాత్ర ప్రారంభించాను

- మొదటి పేజి తరువాయి

చిత్తశుద్ధితో కృషి చేశారని చెప్పారు. 1997-98లోనే తొలిసారి తీర్మానం ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. ఇచ్చిన మాట కోసం చంద్రబాబు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా న్యాయం వైపే నిలబడ్డారని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణపై ఏకగ్రీవ తీర్మానంలో చంద్రబాబుదే కీలకపాత్ర అని స్పష్టం చేశారు. దీన్ని చారిత్రక విజయంగా భావిస్తున్నామని తెలిపారు. 30 ఏళ్ల పోరాటంలో అమరులైన వారికి ఈ విజయం అంకితం ఇస్తున్నామని చెప్పారు. తమ ఉద్యమంలో న్యాయం ఉందనే దానికి ఈ ఏకగ్రీవ తీర్మానాలే నిదర్శనం అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తమకు అండగా నిలిచారని మంద కృష్ణ మాదిగ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మాదిగల ఉద్యమాన్ని గుర్తుచేస్తూ పవన్ కల్యాణ్ కూడా మద్దతు ఇచ్చారని వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణపై ఏకగ్రీవ తీర్మానంలో చంద్రబాబు చతురత ఉందని, ఎస్సీ వర్గీకరణ అంశం ద్వారా చంద్రబాబు సామాజిక న్యాయం చేశారని కొనియాడారు.ఎస్సీ వర్గీకరణపై వైసీపీ ఇప్పటికీ తమ అభిప్రాయాన్ని చెప్పలేదని అన్నారు. గతంలో కనీసం వినతిపత్రం ఇచ్చేందుకు కూడా జగన్ తమకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. జగన్ ఉండి ఉంటే ఎస్సీ వర్గీకరణను ఇక చూసేవాళ్లమే కాదని మంద కృష్ణ వ్యాఖ్యానించారు.

### మంత్రి ఫరూఖ్ కు భార్యావియోగం...

## దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చంద్రబాబు, పవన్, లోకేశ

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అర్ధాంగి షహనాజ్ మరణించారని తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యానని సీఎం చంద్రబాబు తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మృతి చెందడం ఆ కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నానని, ఈ కష్ట సమయంలో గుండె నిబ్బరంతో ఉండాలని మంత్రి ఫరూఖ్ ను కోరుతున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీ న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అర్ధాంగి షహనాజ్ కన్నుమూశారని తెలిసి చింతించానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. జీవిత భాగస్వామి దూరమైన బాధను తట్టుకునే మనోధైర్యాన్ని ఫరూఖ్ గారికి ఇవ్వాలని దేవుడ్ని కోరుకుంటున్నానని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పవన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ గారి అర్ధాంగి షహనాజ్ గారు పవిత్ర రంజాన్ మాసంలో ఇంతిఖాల్ అయ్యారని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఆమెకు జన్నత్ లో ఉన్నతమైన స్థానం ప్రసాదించాలని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని అల్లాను ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఫరూఖ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని లోకేశ్ పేర్కొన్నారు.

## చిరంజీవికి ఒక్కసారి చెబితే మానేశాడు... స్పిరిట్ అంటే అదీ!

- మొదటి పేజి తరువాయి

కోకాకోలా తాగడం అనారోగ్యమని, పిల్లలను చెడగొడుతున్నావని చెప్పాను. ఇది గనుక ఆపకపోతే చిల్డ్రన్స్ డే సందర్భంగా ధర్నా చేస్తామని చెప్పాను. ఆదే రోజు అల్లు అరవింద్ నాకు ఫోన్ చేశాడు. ఏంది నారాయణా... చిరంజీవి గారిపై బాంబులు వేశావు అన్నాడు. నేనేం అనలేదయ్యా అని బదులిచ్చాను. మేం ఈ యాడ్ ద్వారా వచ్చే డబ్బులు చిరంజీవి రక్తనిధికి ఖర్చు పెడుతున్నామని అల్లు అరవింద్ చెప్పాడు. అడుసు తొక్కనేల కాలు కడగనేల అనుకున్నాను... రక్తం చెడగొట్టేందుకు ఓవైపు మీరు ప్రచారం చేస్తూ... చెడిపోయిన రక్తాన్ని మళ్లీ బాగు చేయడానికి ఖర్చు పెడుతున్నారా? అదేం అన్యాయమండీ అని అడిగాను. మరుసటి రోజు మళ్లీ ఫోన్ చేశాడు. మాకు 3 నెలలు టైమ్ ఇవ్వు... మాకు అగ్రిమెంట్ ఉంది అని చెప్పాడు. కరెక్ట్ గా మూడు నెలల తర్వాత ఆపేశాడు. మళ్లీ చిరంజీవి ఎప్పుడూ కోకాకోలా యాడ్ లో నటించలేదు. ఎంత డబ్బులు ఇస్తామన్నా ఆయన దాని జోలికి వెళ్లలేదు... అలా ఉండాలి స్పిరిట్" అని వివరించారు.ఢిల్లీలోని ఆంధ్రా భవన్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ సినీ పరిశ్రమ ద్వారా వచ్చిన ఖ్యాతిని అడ్డం పెట్టుకొని డబ్బు సంపాదన వ్యామోహంతో అనైతిక చర్యలకు పాల్పడదాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.బెట్టింగ్ యాప్ ల ను ప్రమోట్ చేయడం ద్వారా యువత జీవితాలను నాశనం చేస్తున్నారని ఆక్షేపించారు. గతంలో అల్లూరి రామలింగయ్య వంటి వారు కళను సమాజ అభివృద్ధి కి ఉపయోగ పరచారని గుర్తు చేశారు.సినీ పరిశ్రమలో సక్రమంగా వచ్చే సంపాదన ఉన్నవారు కూడా మరింత సంపాదన కోసం సమాజాన్ని పక్కదారి పట్టించే అనేక అనైతిక ప్రకటనల్లో నటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.తమకే తెలియకుండా బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేశామని ఒకరు, చట్ట పరంగా అవకాశం ఉంది కాబట్టి చేశామని ఒకరు చెబుతున్నారని మండిపడ్డారు. మీకు ఉన్న పాపులరిటి కారణంగా మీరు నటించే, ప్రమోట్ చేసే అంశాలను ప్రజలు సులభంగా నమ్మి తీవ్రంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించాలన్నారు. బెట్టింగ్ యాప్ లకు వేలాది మంది యువత బలి అవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నా వాటిని ఇంకా ప్రమోట్ చేయడం నేరమేనని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం కఠినముగానే చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. గుట్కా, పాన్ మసాలాలు, తప్పుడు పద్ధతుల్లో సాగే రియల్ ఎస్టేట్, మోసపూరిత బంగారు వ్యాపారాల ప్రకటనల్లో నటించి సమాజానికి కీడు చేస్తున్నారని పేర్కొన్నారు.

### ట్రంప్ మరో సంచలన నిర్ణయం...

## విద్యాశాఖ మూసివేత...

- మొదటి పేజి తరువాయి

చేశారు. వైట్‌హౌస్‌లో పాఠశాల విద్యార్థులతో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. విద్యాశాఖ ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదని, దాని అధికారాలను రాష్ట్రాలకు తిరిగి అప్పగిస్తామని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, విద్యార్థుల ఫీజు రాయితీలు, కొన్ని ముఖ్యమైన పథకాలను కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ట్రంప్ చర్యను డెమోక్రాట్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇది ఆయన తీసుకున్న అత్యంత వినాశకరమైన చర్యలలో ఒకటని వారు అభివర్ణిస్తున్నారు.విద్యాశాఖ అధికారాలను రాష్ట్రాలకు అప్పగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ మంత్రి లిండా మెక్‌మాన్ తెలిపారు. ప్రజలకు అందుతున్న సేవల్లో ఎటువంటి అంతరాయం లేకుండా చూస్తామని ఆమె స్పష్టం చేశారు. ట్రంప్ ప్రభుత్వంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె అన్నారు.

ట్రంప్ బాధ్యతలు స్వీకరించే నాటికి విద్యాశాఖలో 4,100 మంది ఉద్యోగులు ఉండగా, వారిలో 600 మంది స్వచ్ఛందంగా పదవీ విరమణకు ముందుకొచ్చారు. మిగిలిన సిబ్బందిని తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. అవసరానికి మించి ఉన్న సిబ్బందిపై వేటు వేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని లిండా మెక్‌మాన్ తెలిపారు.కాగా, విద్యాశాఖ మూసివేతపై ఎలాన్ మస్క్ తనదైన శైలిలో సోషల్ మీడియాలో పోస్టుపెట్టారు. విద్యాశాఖను ట్రంప్ సమాధి చేశారన్న అర్థం వచ్చేలా ఒక ఫొటోను పంచుకున్నారు.

### అఖిలప్రియ సొంత పార్టీలో శత్రువులు..

## బయిట పడేదెలా...

**కర్నూలు, మార్చి 21,** మాజీమంత్రి అఖిలప్రియ నిత్యం కాంట్రవర్సీకి కేరాఫ్ అడ్రస్ గా ఉంటారు. ఎవరికైనా ప్రత్యర్థి పార్టీల నుంచి శత్రువులుంటారు. కానీ అఖిలప్రియకు మాత్రం శత్రువులందరూ సొంత వాళ్లే. వాళ్లతో ఈమె శతృత్వం పెంచుకుంటుందో లేక అఖిలప్రియతో వాళ్లు విభేదిస్తున్నారో తెలియదు కానీ సొంత పార్టీ నేతలే ఆమెకు ఇబ్బందికరంగా మారారు. ఆళ్లగడ్డ తన సొంత అడ్డా అని భావించిన అఖిలప్రియకు 2019 ఎన్నికల్లో ఓటమి తప్పలేదు. అయితే ఆ ఓటమికి గల కారణాన్ని అఖిల ప్రియ విశ్లేషించుకోకుండా ఈసారి గెలిచిన తర్వాత కూడా అదే పంథాను కొనసాగిస్తుండటంతో పరిస్థితి మారలేదు. తండ్రి, తల్లి కి ఉన్న బంధాలను కావలని తెంచుకున్నట్లే కనపడుతుంది. ఒంటరిపోరు చేయడానికే అఖిలప్రియ ఇష్టపడుతున్నారని స్పష్టంగా తెలుస్తోంది. భూమా శోభానాగిరెడ్డి, నాగిరెడ్డితో అనుచరులు, బంధువులను అఖిలప్రియ ఇప్పటికే దూరం చేసుకున్నారు. సొంత బంధువులను కూడా ఆమె దగ్గరకు రానివ్వడం లేదు. కనీసం వారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అఖిలప్రియ 2014లో తల్లి మరణంతో ఆమె రాజకీయాల్లోకి చిన్న వయసులో అడుగు పెట్టారు. వెంటనే ఏకగ్రీవంగా ఆళ్లగడ్డకు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత తన తండ్రి భూమా నాగిరెడ్డితో కలసి ఆమె టీడీపీలో చేరారు. నాగిరెడ్డి మరణంతో అఖిలప్రియను మంత్రి పదవి వరించింది. అప్పటి నుంచి ఆమె వ్యవహార శైలి మారింది. మంత్రి పదవిలో ఉన్నంత కాలం అయిన వారిని కూడా కాల్చుకుతిన్నారన్న పేరు పొందడంతో 2019 ఎన్నికలలో ఓటమి పాలు కావాల్సి వచ్చింది.. భూమా నాగిరెడ్డికి అత్యంత సన్నిహితుడు ఏవీ సుబ్బారెడ్డితో బద్ధ శత్రుత్వాన్ని పెంచుకున్నారు.

# ఐపీఎల్ మహా సంగ్రామానికి కౌంట్ డౌన్ : 74 మ్యాచ్ లు.. 65 రోజులు.. 13 నగరాలు..




**హైదరాబాద్ పెన్ పవర్:** మరో సమ్మర్ వచ్చేసింది.. మినీ క్రికెట్.. ఫటాఫట్ క్రికెట్ పండుగ వచ్చేసింది.. ఐపీఎల్ 2025 మహా సంగ్రామానికి కౌంట్ డౌన్ మొదలైంది. 2025, మార్చి 22వ తేదీ నుంచి ప్రారంభం కాబోతున్న మ్యాచ్ తో ప్రపంచం అంతా క్రికెట్ ఫీవర్ లోకి వెళ్లిపోతుంది. ఇప్పటికే టికెట్లు అన్నీ హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. 13 నగరాల్లోని స్టేడియాలు ముస్తాబయ్యాయి. 65 రోజులు.. 74 మ్యాచ్ లు.. 13 నగరాల్లో జరిగే ఐపీఎల్ క్రికెట్ మహా సంగ్రామం పూర్తి వివరాలు.. ఫటాఫట్ తెలుసుకుందామా..

ఈ ఐపీఎల్ లో మొత్తం 10 టీమ్స్ వారి వారి హోమ్ గ్రౌండ్స్ లో మ్యాచ్ లు ఆడనున్నాయి

3 టీమ్స్ మాత్రం అదనంగా సెకండ్ హోమ్ గ్రౌండ్ లో ఆడతాయి

ఢిల్లీ క్యాపిటల్స్ కొన్ని మ్యాచ్ లు విశాఖపట్నంలో ఆడుతుంది

పంజాబ్ కింగ్స్ సెకండ్ హోమ్ గేమ్ ధర్మశాలలో ఆడుతుంది

రాజస్థాన్ రాయల్స్ సెకండ్ హోమ్ గేమ్ గువహతిలో ఆడనుంది.

**ఫార్మాట్ ఎలా ఉంటుంది:**

మొత్తం 10 టీమ్స్ రెండు గ్రూపులుగా విభజించడం జరిగింది.

గ్రూప్ %ూ: జూఖ, ఖఖ=, ==, =జదీ,ూదీఖూ

గ్రూప్ %దీ: వీ×, ూ=ని, +ు, ఐజ, ూూ+

గ్రూప్ లో ఉన్న ప్రతి టీమ్ ఇతర ఒక్కో టీమ్ తో రెండేసి మ్యాచ్ లు ఆడుతుంది

ఇతర గ్రూప్ లో ఉన్న ఒక్కో టీమ్ తో కూడా రెండు మ్యాచ్ లు ఆడుతుంది

హోమ్ గ్రౌండ్ లో ప్రతి టీమ్ 7 మ్యాచ్ లు ఆడుతుంది

ఇతర గ్రౌండ్ లో కూడా 7 మ్యాచ్ లు ఆడాల్సి ఉంటుంది.

**మ్యాచ్ టైమింగ్స్:**

మధ్యాహ్నం మ్యాచ్ లు 3.30 గంటలకు స్టార్ట్ అవుతాయి

సాయంత్రం మ్యాచ్ లు 7.30 కు ప్రారంభం అవుతాయి.

**మారిన రూల్స్:**

బాల్ పై లాలాజలం (ఉమ్ము) రుద్దడంపై ఉన్న నిషేధాన్ని ఎత్తేశారు.

అంటే ఇక నుంచి బాల్ పైన ఉమ్ము రుద్దవచ్చు

స్లో ఓవర్ రేట్ కారణంగా కెప్టెన్స్ పై బ్యాన్ ఇకనుంచి ఉండదు

కాకపోతే వారి మ్యాచ్ ఫీజు లో కోత విధిస్తారు

స్లో ఓవర్ రేట్ పై కెప్టెన్స్ కు డీమెరిట్ పాయింట్స్ కూడా ఇస్తారు

మూడేళ్లు ఈ పాయింట్స్ పరిగణనలో ఉంటాయి

ఆఫ్ సైడ్, తలపైనుంచి వెళ్లే వైడ్స్ కోసం డేగకన్ను (Hawk-eye) వినియోగిస్తారు

గతంలో నడుము పైనుంచి వెళ్లే నోబాల్స్ కోసమే వాడేవారు

**5 మంది కొత్త కెప్టెన్లు:**

ఈ ఐపీఎల్ లో 5 టీమ్స్ తమ కెప్టెన్లను మార్చాయి..

పంజాబ్ కింగ్స్ – శ్రేయస్ అయ్యర్

కోల్ కతా నైట్ రైడర్స్ – అజింక్యా రహనే

లక్నో సూపర్ గెయింట్స్ – రిషభ్ పంత్

ఢిల్లీ క్యాపిటల్స్ – అక్షర్ పటేల్

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ – రజత్ పాటిదార్

**ఫ్యాన్స్ మిస్ అవ్వనున్న ప్లేయర్లు:**

బ్యాక్ ఇంజురీ (వెన్ను నొప్పి) కారణంగా బుమ్రా కొన్ని మ్యాచ్ లకు దూరంగా ఉండనున్నాడు.

లక్నో ప్లేయర్ మయాంక్ సగం మ్యాచ్ లకు దూరం అవుతున్నాడు

అల్లా గజన్ఫర్, లిజాడ్ విలియమ్స్, బ్రైడన్ కెర్సే లు గాయాల కారణంగా అందుబాటులో లేరు

హారీ బ్రూక్ సీజన్ మొత్తానికే తొలగించడ జరిగింది.

# నో బాల్, వైడ్ బాల్ నిర్ణయం మరింత పక్కాగా.. ఇక నుంచి కొత్త టెక్నాలజీ.. కొత్త రూల్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ అంటేనే కొత్త కొత్త ప్రయోగాలకు, మార్పులకు, రూల్స్ కు వేదిక. ప్రతి సీజన్ లో ఏదో ఒక నిబంధనను తీసుకురావడం చూస్తూనే ఉన్నాం. క్రికెట్ మరింత ఈజీగా ఉండేందుకు టెక్నాలజీని వినియోగించుకుని మార్పులు చేస్తూ వస్తోంది బీసీసీఐ. తాజాగా IPL 2025 లో భాగంగా నోబాల్స్ కు సంబంధించి కొత్త రూల్స్, కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది బీసీసీఐ.


ఈ ఐపీఎల్ లో నోబాల్, వైడ్ బాల్ నిర్ణయం 100 శాతం పక్కాగా ఉండేందుకు.. షార్ట్ డెలివరీస్ ను అంచనా వేసేందుకు వినూత్నమైన పద్ధతిని తీసుకొచ్చింది బీసీసీఐ. ప్రస్తుతం ఫాస్ట్ బౌలర్స్ కు రెండు బౌన్సర్స్ వేసుకునే చాన్స్ ఉంది. మూడో బౌన్సర్ ను వైడ్ గా కన్సిడర్ చేస్తారు. అయితే బ్యాటర్ తలపై నుంచి వెళ్లే బాల్ ను వైడ్ బాల్ గా డిసైడ్ చేస్తారు. ఇవి ఇప్పటివరకు ఉన్న నియమాలే.

నడుము పైనుంచి వెళ్లే ఫుల్ టాస్ బాల్ ను కొలిచేందుకు.. కచ్చితత్వం కోసం ప్రతి ప్లేయర్ నడుమును టేప్ తో కొలిచేలా IPL2024 లో నిబంధనలు తెచ్చింది బీసీసీఐ. అయితే ఈ సారి నడుముతో పాటు భుజం (షోల్డర్), తల (హెడ్) ను కొలిచేలా కొత్త నిబంధన తీసుకొచ్చింది. బ్యాటర్ క్రీజ్ లో బాల్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నపుడు అతడి నడుము, భుజం, తల ఎంత ఎత్తు ఉంటుందో దాన్ని కన్సిడర్ చేస్తారు. ఈ కొలతలను సిస్టమ్ లోకి ఎంట్రీ చేస్తారు. థర్డ్ అంపైర్ల దగ్గర కూర్చునే హాక్ ఐ (పై నుంచి చూసే కెమెరా – డేగ కన్ను) ఆపరేటర్లకు నడుంపై నుంచి వెళ్లే ఫుల్ టాస్ వైడ్లకు, నోబాల్ వైడ్ బాల్ కు సంబంధించిన బౌన్సర్ లను రివ్యూ చేసేందుకు ఇది చాలా ఉపయోగపడుతుంది.

**ఈ సారి 7 మంది కొత్త అంపైర్లు:**

హై ప్రెజర్ మ్యాచ్ ల కోసం ఈసారి 7 మంది కొత్త అంపైర్లను ప్రవేశపెడుతోంది బీసీసీఐ. అందులో స్వరూపానంద్ కన్నూర్, అభిజీత్ భట్టాచార్య, పారాశర్ జోషి, అనిశ్ సహస్రబుద్ధే, కేయూర్ కేల్కర్, కౌశిక్ గాంధీ, అభిజీత్ బెనర్జీ. అయితే సీనియర్ అంపైర్లైన ఎస్.రవి, సీకే నందన్ ఈ కొత్త అంపైర్లకు మెంటర్స్ గా వ్యవహరిస్తున్నారు.

# ఉప్పల్ స్టేడియం భద్రతకు సర్వం సిద్ధం : ఇక మ్యాచ్‌లు హ్యాపీగా ఆడుకోవటమే



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ఫ్యాన్స్ ఎదురుచూస్తున్న %ూూ% పండుగ మరికొన్ని గంటల్లో షురూ అవ్వబోతోంది. ఫ్యాన్స్ ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకుని రెడీ గా ఉన్నారు. ఐపీఎల్ అంటే ఫుల్ హంగామా చేసే హైదరాబాద్ ఫ్యాన్స్.. మ్యాచ్ కోసం ప్లాన్స్ సిద్ధం చేసుకున్నారు. శనివారం (మార్చి 22) ఐపీఎల్ ప్రారంభం కానుండటంతో ప్రేక్షకుల్లో సందడి మొదలయ్యింది. ఐపీఎల్ మ్యాచ్ ల కోసం ఉప్పల్ స్టేడియం సిద్ధమయ్యింది. మ్యాచ్ ల కోసం పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు సీపీ సుధీర్ బాబు తెలిపారు. మొత్తం 3 వేలకు పైగా పోలీస్ బలగాలతో, 450 సీసీ కెమెరాలతో నిత్యం నిఘా ఉంటుందని తెలిపారు. ప్రతి గేట్ దగ్గర మొబైల్ చెకింగ్ ఉంటుందని ప్రెస్ మీట్ లో చెప్పారు. ఉప్పల్ లో మొత్తం 7 లీగ్ మ్యాచ్ లు ఉన్నాయి. అందుకోసం ఉప్పల్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి అయినట్లు ఆయన తెలిపారు. మ్యాచ్ సందర్భంగా వచ్చే ప్రేక్షకులకు వాటర్ బాటిల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని అన్నారు. ఖఆదివారం (మార్చి 23) మధ్యాహ్నం 3.30 కు మ్యాచ్ సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. మ్యాచ్ కోసం 3 గంటల ముందే గేట్లు ఓపెన్ చేస్తామని తెలిపారు. ప్రేక్షకులు ముందుగానే స్టేడియానికి చేరుకోవాలని సూచించారు. ప్రేక్షకుల వాహనాల పార్కింగ్ కోసం19 పార్కింగ్ ప్లేసులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రేక్షకుల రవాణా సౌకర్యం కోసం మెట్రో సర్వీసులు అర్ధరాత్రి వరకు ఉంటాయని తెలిపారు.



ఐశ్వర్య రాజేష్ గోల్డెన్ ఆరా ప్రకాశవంతంగా మెరిసింది

# దేవరకొండ కింగ్‌డమ్.. పార్ట్ 2 ఉంది కానీ..



విజయ్ దేవరకొండ కెరీర్‌లో మరో పాన్ ఇండియా మాస్ ఎంటర్టైనర్‌గా వస్తున్న చిత్రం కింగ్‌డమ్. ఈ సినిమా గురించి మొదటి అనౌన్స్‌మెంట్ నుంచే హైప్ కొనసాగుతోంది. 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం, విజయ్ దేవరకొండ అభిమానులను ఎప్పటి నుంచో ఉత్కంఠలో పడేసింది. స్టార్ హీరోకు సరిపోయే స్థాయిలో భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం, రీసెంట్‌గా మరో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను అందుకుంది. ఇప్పటివరకు ఈ సినిమాను స్ట్రాంగ్ స్టోరీ లైన్ ఉన్న మూవీగా మాత్రమే చూశారు. కానీ ఇప్పుడు ఇది రెండు పార్ట్‌లుగా తెరకెక్కనున్నట్లు అధికారికంగా బయటకొచ్చింది. సినిమా షూటింగ్ దశలోనే ఉన్నప్పటికీ, మేకర్స్ ప్రమోషన్స్‌కి మోడ్రన్ స్ట్రాటజీ ఫాలో అవుతున్నారు. ఇటీవలే మ్యాడ్ స్క్వేర్ ప్రమోషన్స్‌లో భాగంగా నిర్మాత నాగవంశీ ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా హై బడ్జెట్‌లో రూపొందుతుండటంతో పాటు, యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కలిపి విజయ్ కెరీర్‌లో బిగ్గెస్ట్ మూవీల్లో ఒకటిగా నిలవబోతోందని తెలిపారు. ఈ సినిమా మే 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నాగవంశీ మాట్లాడుతూ, "కింగ్‌డమ్ కథ రెండు పార్ట్‌లుగా నాకు చెప్పబడింది. స్టోరీని బలవంతంగా లెంగ్త్ పెంచి సీక్వెల్ చేయడం లేదు. గౌతమ్ మొదటి భాగం చెప్పినప్పుడు, రెండో పార్ట్‌కు వేరే స్క్రీన్‌ప్లే ఉంటుందని చెప్పాడు. అయితే, రెండో భాగానికి టైటిల్ ఇంకా ఖరారు కాలేదు. మొదటి పార్ట్ విజయాన్ని బట్టి సీక్వెల్ తీసే విషయంపై నిర్ణయం తీసుకుంటాం. ఈ సినిమా ప్రేక్షకుల అంచనాలను అందుకునేలా అన్ని మేజర్ టిక్ బాక్స్‌లను పూర్తి చేస్తుందని నమ్మకంగా చెబుతాను" అంటూ క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందించగా, సితార ఎంటర్టైన్మెంట్స్ భారీగా నిర్మిస్తోంది. విజువల్స్ పరంగా, సాంకేతికంగా కింగ్‌డమ్ కొత్త లెవెల్‌లో ఉంటుందని టాక్. యాక్షన్ ఎపిసోడ్స్ మాస్ ప్రేక్షకులను థ్రిల్ చేసేలా ఉంటాయని సమాచారం. విజయ్ దేవరకొండ కెరీర్‌లో ఇదివరకు చూడని యాక్షన్ మోడ్‌ను ఇందులో చూపించబోతున్నారని ఫిల్మ్ సర్కిల్స్ చెబుతున్నాయి. ఇప్పటి వరకు విడుదలైన పోస్టర్లు, వీడియో గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. మే 30న గ్రాండ్ రిలీజ్ కోసం సన్నాహాలు జరుగుతుండగా, మూవీ ప్రీ రిలీజ్ బిజినెస్ కూడా హాట్ టాపిక్‌గా మారింది. కింగ్‌డమ్ విజయం సాధిస్తే, రెండో భాగం మరింత భారీ స్థాయిలో తెరకెక్కించే అవకాశం ఉం ది. మరి, విజయ్ దేవరకొండ ఈ సినిమా ద్వారా బ్లాక్‌బస్టర్ అందుకుంటాడో లేదో చూడాలి.




దివ్య భారతి పసుపు రంగులో స్టన్స్ చేస్తూ, కింగ్‌స్టన్ యొక్క థ్రిల్స్‌కి జీవం పోసింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com